

# నిజం

దృష్టి తెలుగు న్యూస్

TG/TEL/25/A3731

WANTED
రిపోర్టర్లు కావలెను
నిజం దృష్టి తెలుగు న్యూస్
దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లోని అన్ని జిల్లా కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
ఆయా జిల్లాల్లోని రాజకీయాలు, ఇతర అంశాలపై లోతైన విశ్లేషణలు రాయగల సామర్థ్యం ఉండాలి, అనుభవం గల వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.
సెల్: 9247842354

హైదరాబాద్ | ఎడిటర్: వరుదు సుజాత | సంపుటి:-1 | సంచిక:-285 | పేజీలు:-4 | బుధవారం 30-09-2026
Hydrabab | Editer name : varudu sujatha | volume:01, | issue:285 | pages:04 | Wendesday - 30-09-2026

## ఖమేనీ అంత్యక్రియలకు మోదీ దూరం

భారత్ తరఫున వెళ్లేది వీరే..!

- ఖమేనీ అంత్యక్రియలు ప్రారంభం
- ఆ సమయంలో ఇండోనేషియా, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా పర్యటనకు మోదీ
- ముందే ఖరారైన షెడ్యూల్ కారణంగా అంత్యక్రియలకు ప్రధాని దూరం
- భారత్ తరఫున బిహార్ గవర్నర్, విదేశాంగ శాఖ సహాయ మంత్రి
- ఖమేనీ ఖననం



ఇరాన్ దివంగత మాజీ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ అంత్యక్రియలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హాజరుకావడం లేదు. ఆయన స్థానంలో బీహార్ గవర్నర్ లెఫ్టినెంట్ జనరల్ సయ్యద్ అతా హస్నైన్, కేంద్ర విదేశాంగ శాఖ - మిగతా 2 లో

## అమెరికా దాచిన నిజం?.. ఇరాన్ దాడులతో భారీ నష్టం!

- అమెరికా స్థావరాలకు భారీ నష్టం జరిగిందన్న నివేదిక
- బహ్రెయిన్‌లోని నౌకాదళ స్థావరానికి తీవ్ర దెబ్బ
- సైనిక స్థావరాల మార్పుపై పెంటగాన్ ఆలోచన
- పునర్నిర్మాణానికే 400 మిలియన్ డాలర్ల అంచనా
- మొత్తం యుద్ధ వ్యయం 40 బిలియన్ డాలర్లకు చేరినట్లు అంచనా



ఇరాన్ క్షిపణి, డ్రోన్ దాడుల వల్ల పశ్చిమాసియాలో అమెరికా సైనిక స్థావరాలకు అధికారికంగా వెల్లడించిన దానికంటే చాలా ఎక్కువ నష్టం జరిగిందని ఓ నివేదిక వెల్లడించింది. దీంతో ఆ ప్రాంతంలోని అమెరికా సైనిక స్థావరాల భద్రత, - మిగతా 2 లో

## మూసీ ప్రాజెక్టులో ఎవరికీ అన్యాయం జరగదు



- మూసీ ప్రాజెక్టు భూసేకరణ, పునరావాసం అంశాలపై పొంగులేటి సమీక్ష
- ఇళ్లు కోల్పోయే వారికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించాలని ఆదేశం
- భూములు కోల్పోయే రైతులకు పరిహారం, పునరావాసం కల్పిస్తామని వెల్లడి

మూసీ నది పునరుద్ధరణ ప్రాజెక్టులో ఎవరికీ అన్యాయం జరగనీయబోమని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. - మిగతా 2 లో

## కొడంగల్‌లో 33 వేల డూప్లికేట్ ఓట్లు ఉన్నాయి



వాటితోనే రేవంత్ గెలిచారా?: కవిత

- దేశ వ్యాప్తంగా ఎనిమిది సార్లు 'సర్' ప్రక్రియ జరిగిందన్న కవిత
- బోధన్ లో ఇప్పటి వరకు 7 వేల ఓట్లు తీసేశారని వెల్లడి
- హైదరాబాద్‌లో ఉండే చాలా మందికి ఏపీలో కూడా ఓట్లు ఉన్నాయన్న కవిత

తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)- మిగతా 2 లో

# రాముడు-శివుడిపై సీఎం రేవంత్ రెడ్డి కామెంట్స్

- జాతీయ రాజకీయాల్లో దుమారం
- ఉత్తర, దక్షిణ భారతదేశంపై సీఎం రేవంత్ చేసిన వ్యాఖ్యలతో వివాదం
- తాము ద్రావిడులమని, శివభక్తులమని.. ఉత్తరాది వారు ఆర్యులని, రామభక్తులని వ్యాఖ్య
- హిందువులను విడదీసేందుకే రేవంత్ మాట్లాడుతున్నారని బీజేపీ ఆరోపణ
- రాహుల్ గాంధీ ఆదేశాలతోనే రేవంత్ ఈ వ్యాఖ్యలు చేశారని బీజేపీ విమర్శ




తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు జాతీయ రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపాయి.

## జాతీయ గ్రామీణాభివృద్ధి సదస్సులో పాల్గొన్న సీతక్క

- వీబీ జీ రామ్ జీ పథకంపై కేంద్రానికి అభ్యంతరాలను తెలియజేసిన సీతక్క
- కొత్త పథకం ప్రవేశపెడితే మొత్తం ఆర్థిక భారం రాష్ట్రంపైనే పడుతుందని వ్యాఖ్య
- పీఎం ఆవాస్ యోజన కింద తక్షణమే గృహాలను మంజూరు చేయాలని విన్నపం



వీబీ జీ రామ్ జీ పథకం 60:40 నిధుల విధానంపై తెలంగాణకు తీవ్ర అభ్యంతరాలు ఉన్నాయని మంత్రి సీతక్క కేంద్రానికి తెలియజేశారు. ఈరోజు ఢిల్లీలో జరిగిన జాతీయ గ్రామీణాభివృద్ధి సదస్సులో పాల్గొన్న ఆమె... తెలంగాణలో అమలు చేస్తున్న గ్రామీణాభివృద్ధి పథకాల వివరాలను కేంద్రానికి వివరించారు. జులై 2న వీబీ జీ రామ్ జీ పథకం కొనసాగించాలా? లేక కొత్త పథకం తీసుకురావాలా? అనే అంశంపై తెలంగాణ కేబినెట్ తుది నిర్ణయం తీసుకుంటుందని సీతక్క ప్రకటించారు. కొత్త పథకం ప్రవేశపెడితే 100 శాతం ఆర్థిక భారం రాష్ట్రంపైనే పడుతుందని, ఇది సమస్యాత్మకమని కేంద్రానికి తెలియజేశారు. ఎంజీఎన్ఆర్ఈజీఎస్‌లో - మిగతా 2 లో

## బంగారం కొనుగోళ్లు తగ్గించారు ప్రజలకు మోదీ ధన్యవాదాలు



- బంగారం కొనుగోళ్లు, ఇంధన వాడకం తగ్గించినందుకు ప్రజలకు మోదీ ధన్యవాదాలు
- పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో ప్రధాని చేసిన విజ్ఞప్తికి అద్భుత స్పందన
- సీషెల్స్ పర్యటన నుంచే 135వ మన్ కీ బాత్‌లో ప్రసంగించిన ప్రధాని
- ప్రజల ఐక్యత అంతర్జాతీయ వేదికపై దేశానికి బలమని వ్యాఖ్య

పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ వాతావరణం దృష్ట్యా తాను చేసిన విజ్ఞప్తికి స్పందించి, బంగారు - మిగతా 2 లో

## దేవుడి పేరుతో రాజకీయాలు వద్దు



- దేవుడి పేరుతో రాజకీయాలు చేయడం సరికాదన్న పొన్నం
- ప్రతి ఒక్కరి విశ్వాసాలను గౌరవించడం మన సంస్కృతి అని వ్యాఖ్య
- ఆలయాల అభివృద్ధి ప్రభుత్వ బాధ్యత అని స్పష్టీకరణ

రాజకీయ ప్రయోజనాల కోసం దేవుడి పేరును వాడుకోవడం సరికాదని, అది ఎవరికీ మేలు చేయదని తెలంగాణ రవాణా, బీసీ సంక్షేమ - మిగతా 2 లో

## మూడు నెలల్లో ఎన్నికలు రావొచ్చు డీఎంకే శ్రేణులకు స్టాలిన్ పిలుపు

- తమిళనాడులో రాజకీయాలు వేగంగా మారుతున్నాయన్న డీఎంకే అధినేత
- ఇప్పటి నుంచే ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని పిలుపు
- టీవీకే మిత్రపక్షాల సపోర్ట్‌తో అధికారంలోకి వచ్చిందన్న స్టాలిన్
- అందుకే ప్రభుత్వం ఎప్పుడు కూలిపోతుందోనని అనుమానం
- టీవీకే హయాంలో అభివృద్ధి మందగించిందన్న మాజీ సీఎం




తమిళనాడులో రాజకీయ పరిణామాలు వేగంగా మారే అవకాశం ఉందని డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ అన్నారు. మరో ఐదేళ్లు ఎదురుచూడాల్సిన అవసరం లేదని, మూడు నెలలు లేదా ఆరు నెల్లో ఎన్నికలు రావొచ్చని పార్టీ శ్రేణులను అప్రమత్తం చేశారు. ఇప్పటి నుంచే ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. చెన్నైలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో మాజీ మంత్రి

## బుల్లెట్ ట్రైన్ పేరుతో రియల్ ఎస్టేట్ దందా

బుల్లెట్ ట్రైన్ భూసేకరణ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తోందన్న కేటీఆర్

బహదూర్‌పల్లి రైతుల వ్యవసాయ భూములను తీసుకోవడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు వెల్లడి




శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ వద్ద ప్రభుత్వ భూమి ఉండగా రైతుల భూములు ఎందుకని ప్రశ్న బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద ఎత్తున రియల్

## ఏపీ డిజిటల్ భవిష్యత్తుపై చంద్రబాబు ఫోకస్

సునీల్ మిట్టల్‌తో కీలక భేటీ



- చంద్రబాబుతో భారతీ ఎంటర్‌ప్రైజెస్ చైర్మన్ సునీల్ మిట్టల్ భేటీ
- రాష్ట్రంలో డిజిటల్ మౌలిక సదుపాయాలపై కీలక చర్చలు
- డేటా సెంటర్లు, కనెక్టివిటీ, అండర్ సీ కేబుల్‌పై ప్రధానంగా దృష్టి
- చర్చలు ఫలప్రదంగా సాగాయన్న ముఖ్యమంత్రి చంద్రబాబు

ఆంధ్రప్రదేశ్‌లో డిజిటల్ మౌలిక సదుపాయాలను బలోపేతం చేసే దిశగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు - మిగతా 2 లో

## ఇక్కడున్నది మోదీ-చంద్రబాబు-పవన్ అని గుర్తుంచుకోవాలి

సీఎం చంద్రబాబు మాస్ వార్నింగ్

- మోదీ సహకారం, పవన్ హుషారుతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నామన్న చంద్రబాబు
- గత ప్రభుత్వ హయాంలో 880 కి.మీ. సీసీ రోడ్లు వేశారన్న చంద్రబాబు
- మేం రెండేళ్లలో 6,500 కి.మీ. వేశామని వెల్లడి
- అభివృద్ధికి అడ్డుపడితే ఎంతమాత్రం సహించబోమని హెచ్చరిక
- స్థానిక ఎన్నికల్లోనూ కూటమిదే విజయం ఖాయమన్న చంద్రబాబు




కూటమి ప్రభుత్వం పేదలకు పట్టాభిషేకం చేస్తుంటే, మరికొందరు విధ్వంసంతో రక్తాభిషేకం చేస్తామంటున్నారని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకోవాలని చూస్తే సహించే ప్రసక్తి లేదని, ఇక్కడ ఉన్నది మోదీ, చంద్రబాబు, పవన్ అని గుర్తుంచుకోవాలని ఆయన ఈ సందర్భంగా ప్రత్యర్థులను హెచ్చరించారు. గత ప్రభుత్వ హయాంలోని విధ్వంసానికి, నేటి కూటమి ప్రభుత్వ వికాసానికి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలు గమనించాలని ఆయన కోరారు. ఉదయగిరి నియోజకవర్గంలో నిర్వహించిన 'పల్లె పండుగ-3.0' బహిరంగ సభలో చంద్రబాబు ప్రసంగించారు. ప్రధాని నరేంద్ర మోదీ సహకారం, తన అనుభవం,

### వైద్య పరీక్షల కోసం భార్యతో

## కలిసి ముంబై వెళ్లిన పవన్ కల్యాణ్

మొదటిపేజీ తరువాయి – సంబంధించిన వైద్య పరీక్షల నిమిత్తం ఆయన ముంబైలోని కోకిలాబెన్ ధీరూభాయ్ అంబానీ ఆసుపత్రికి వెళ్లనున్నారు. ఈ పర్యటనలో ఆయన వెంట భార్య అన్నా కొణిదెల కూడా ఉన్నారు. గత కొంతకాలంగా పవన్ కల్యాణ్ రెండు భుజాలకు సంబంధించి 'రొటేటర్ కఫ్' గాయంతో బాధపడుతున్నారు. ఈ గాయం కారణంగా ఆయన భుజాల కండరాలు చిట్లినట్లు సమాచారం. ఎన్నికల ప్రచార సమయంలోనూ ఈ నొప్పితో ఇబ్బంది పడినప్పటికీ, ఆయన తన పర్యటనలను కొనసాగించారు. ప్రస్తుతం ప్రభుత్వ బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో, పూర్తిస్థాయిలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగానే ఆయన ముంబైలోని ప్రముఖ ఆసుపత్రికి వెళ్లినట్లు తెలుస్తోంది. తాను వరుసగా సినిమాలు చేసిన సమయంలో తగిలిన గాయాలు ఇప్పుడు బాధిస్తున్నాయని పవన్ పలు సందర్భాల్లో చెప్పారు. ఇటీవల ఆయనకు సైనస్ శస్త్రచికిత్స కూడా జరిగింది.

## ఏపీ డిజిటల్ భవిష్యత్తుపై చంద్రబాబు ఫోకస్

మొదటిపేజీ తరువాయి – నాయుడు కీలక సమావేశం నిర్వహించారు. ప్రముఖ టెలికాం దిగ్గజం భారతీ ఎంటర్‌ప్రైజెస్ వ్యవస్థాపక చైర్మన్ సునీల్ భారతీ మిట్టల్‌తో ఆయన భేటీ అయ్యారు. రాష్ట్ర ప్రజలకు మెరుగైన కనెక్టివిటీని అందించడం, డిజిటల్ రంగంలో పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ఈ చర్చలు సాగాయి. ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసంలో ఈ సమావేశం జరిగింది. ఈ భేటీలో పలు కీలక అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. సునీల్ మిట్టల్‌తో జరిగిన చర్చలు అత్యంత ఫలప్రదంగా సాగాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సామాజిక మాధ్యమం 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా వెల్లడించారు. "ఆంధ్రప్రదేశ్ డిజిటల్ మౌలిక సదుపాయాల బలోపేతం, పౌరులకు మెరుగైన కనెక్టివిటీని అందించడంపై నిర్మాణాత్మక చర్చలు జరిగాయి" అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు. మరోవైపు, విశాఖపట్నంలో ఏర్పాటు చేస్తున్న గూగుల్ ఏఐ డేటా సెంటర్ ప్రాజెక్టులో భారతీ ఎంటర్‌ప్రైజెస్‌కు చెందిన ఎయిర్‌టెల్ నెక్స్‌ట్రా ఇప్పటికే భాగస్వామిగా ఉంది. భారీ పెట్టుబడులతో, స్వచ్ఛ ఇంధనంతో నడిచేలా రూపొందిస్తున్న ఈ ప్రాజెక్టుకు సంబంధించి 2026 ఏప్రిల్‌లో శంకుస్థాపన చేసేలా ప్రణాళికలు సిద్ధమయ్యాయి. ఈ ప్రాజెక్టును 2028 సెప్టెంబర్ నాటికి పూర్తి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇదివరకే భాగస్వామ్య సంస్థలను కోరారు.

## మూసీ ప్రాజెక్టులో ఎవరికీ అన్యాయం జరగదు

మొదటిపేజీ తరువాయి – భూసేకరణ, పునరావాసం అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించిన మంత్రి... మానవీయ కోణాన్ని దృష్టిలో ఉంచుకుని భూసేకరణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఇళ్లు కోల్పోయే కుటుంబాలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించాలని సూచించారు. భూములు కోల్పోయే రైతులకు తగిన పరిహారం, పునరావాసం అందించాలని, ఈ విషయంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు. మూసీ ప్రాజెక్టు ద్వారా హైదరాబాద్ నగరం మరింత అందంగా మారాలని, విస్తృతంగా అభివృద్ధి చెందాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ప్రాజెక్టు వల్ల ఏ ఒక్కరికీ ఇబ్బంది కలగకుండా చూస్తామని ఆయన హామీ ఇచ్చారు.

## కొడంగల్‌లో 33 వేల డూప్లికేట్ ఓట్లు ఉన్నాయి

మొదటిపేజీ తరువాయి – ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ హాట్ టాపిక్ గా మారింది. దీనిపై తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మీడియాతో మాట్లాడుతూ... దేశవ్యాప్తంగా ఇప్పటివరకు ఎనిమిది సార్లు 'సర్' ప్రక్రియ జరిగిందని తెలిపారు. బోధన్ నియోజకవర్గంలో ఇప్పటి వరకు 7 వేల ఓట్లు తీసేశారని... దీనిపై ఎన్నికల సంఘం తక్షణమే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నియోజకవర్గం కొడంగల్‌లో కేవలం 800 ఓట్లను మాత్రమే తొలగించారని కవిత విమర్శించారు. కానీ తాము క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే.. అక్కడ ఏకంగా 33 వేల డూప్లికేట్ ఓట్లు ఉన్నట్లు తేలిందని అన్నారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో రేవంత్ రెడ్డి 32 వేల మెజారిటీతోనే గెలిచారని.. ఈ డూప్లికేట్ ఓట్లతోనే ఆయన గెలిచారా? అనే అనుమానం తమకు ఉందన్నారు. సినీనటుడు ప్రకాశ్ రాజ్‌కు రెండు వేర్వేరు చోట్ల ఓట్లు ఉన్నాయని, వాటిని తొలగించడానికి ఏడేళ్ల సుదీర్ఘ సమయం పట్టిందని ఈసీని విమర్శించారు. హైదరాబాద్‌లో ఉండే చాలా మంది ఓటర్లకు అటు ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఓట్లు ఉన్నాయని, ఈ డూప్లికేట్ ఓట్లను తొలగించడంలో అధికారులు ఫెయిల్ అయ్యారని ఆరోపించారు. దేశవ్యాప్తంగా 'సర్' ప్రక్రియ జరుగుతున్నందున.. రాష్ట్రాల మధ్య ఉన్న ఓటర్ డేటాను లోతుగా పరిశీలన చేయాలని కవిత సూచించారు. ఒక పౌరుడికి దేశంలో ఎక్కడైనా ఒకే ఒక్క చోట మాత్రమే ఓటు ఉండేలా చూడాలని అన్నారు. డూప్లికేట్ ఓట్ల స్కామ్‌పై కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

## భారీ వర్షాల ఎఫెక్ట్.. సీఎం రేవంత్ సభ రద్దు

మొదటిపేజీ తరువాయి – వర్షాల కారణంగా సభను హైదరాబాద్‌కు మార్చుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మధిర నియోజకవర్గంలో మంగళవారం నిర్వహించాల్సిన రైతు ఆశీర్వాద సభకు సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకావాల్సి ఉంది. అయితే రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలు, ప్రతికూల వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని సభను రద్దు చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. సభను హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనిని 'రైతు భరోసా పంపిణీ సదస్సు'గా నిర్వహించనున్నారు. కార్యక్రమానికి అవసరమైన అన్ని ఏర్పాట్లను వెంటనే పూర్తి చేయాలని మంత్రులు, ఉన్నతాధికారులకు సీఎం ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం సాయంత్రం 4 గంటలకు కార్యక్రమం ప్రారంభం కానుంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రైతులు ఇందులో పాల్గొనేలా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాల్లోని రైతు వేదికల ద్వారా డిజిటల్, వర్చువల్ విధానంలో సమావేశాన్ని ప్రత్యక్షంగా వీక్షించే అవకాశం కల్పించనున్నారు.

## ఖమేనీ అంత్యక్రియలకు మోదీ దూరం



మొదటిపేజీ తరువాయి – సహాయ మంత్రి పవిత్ర మార్గెరిటా భారత ప్రతినిధులుగా పాల్గొననున్నారు. ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్ ఇటీవల ప్రధాని మోదీకి అధికారికంగా ఆహ్వానం పంపారు. అయితే ఆ సమయంలో ఇండోనేషియా, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా పర్యటన ఇప్పటికే ఖరారు కావడంతో మోదీ హాజరు కాలేకపోతున్నారు. ఈ షెడ్యూల్ ముందుగానే ఖరారైందని అధికార వర్గాలు తెలిపాయి. ఫిబ్రవరి 28న అమెరికా-ఇజ్రాయెల్ వైమానిక దాడిలో ఖమేనీ మరణించారు. తొలుత మార్చిలో అంత్యక్రియలు నిర్వహించాలని భావించారు. కానీ ప్రాంతీయ ఉద్రిక్తతల కారణంగా వాటిని వాయిదా వేశారు. ఇప్పుడు జులైలో పలువురు దేశాధినేతలు, ప్రతినిధుల సమక్షంలో కార్యక్రమాలు నిర్వహించనున్నారు. జులై 4న టెహ్రాన్‌లోని గ్రాండ్ మొసల్లా సముదాయంలో ఖమేనీ భౌతికకాయాన్ని ప్రజల సందర్శనార్థం ఉంచనున్నారు. చివరి అంత్యక్రియలు జులై 9న ఖమేనీ స్వస్థలమైన మష్హద్‌లోని ఇమామ్ రెజా దర్గా వద్ద జరగనున్నాయి.

## దేవుడి పేరుతో రాజకీయాలు వద్దు

మొదటిపేజీ తరువాయి – శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రతి వ్యక్తికి తమ తమ దేవతలపై విశ్వాసం ఉంటుందని, ఇతరుల నమ్మకాలను గౌరవించడం భారతీయ సంస్కృతిలో భాగమని ఆయన పేర్కొన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారని పొన్నం ప్రభాకర్ తెలిపారు. రాష్ట్రంలోని దేవాలయాలను అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆయన స్పష్టం చేశారు. వేములవాడ రాజన్న, భద్రాద్రి రాముడు, కొండగట్టు ఆంజనేయ స్వామి సహా అన్ని ఆలయాల పట్ల తనకు గౌరవం, విశ్వాసం ఉన్నాయని చెప్పారు. వ్యక్తిగతంగా తనకు శివుడు ఆరాధ్య దైవమని ఆయన పేర్కొన్నారు. ప్రజల విశ్వాసాలను ప్రభుత్వం గౌరవిస్తుందని, రాష్ట్రవ్యాప్తంగా ఆలయాల అభివృద్ధికి కట్టుబడి ఉందని అన్నారు.

# సీఎం చంద్రబాబు జిల్లాల బాట.. 5 రోజుల షెడ్యూల్ ఖరారు

మొదటిపేజీ తరువాయి – ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టడంతో పాటు, సంక్షేమ కార్యక్రమాలను ప్రారంభించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన ఆయా జిల్లాల్లోనే బస చేయనుండటం ప్రాధాన్యత సంతరించుకుంది.

**పింఛన్ల పంపిణీతో మొదలు..**

జులై 1వ తేదీన తన పర్యటనను సంక్షేమ కార్యక్రమంతో ప్రారంభించనున్నారు. 'పేదల సేవలో' కార్యక్రమంలో భాగంగా నెల్లూరు జిల్లా చిల్లకూరు మండలంలో పెంచిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొంటారు. అనంతరం అదే రోజు తిరుపతి జిల్లా శ్రీ సిటీకి చేరుకుంటారు. అక్కడ ప్రముఖ ద్విచక్ర వాహనాల తయారీ సంస్థ హీరో మోటో కార్ప్ ఏర్పాటు చేయనున్న గ్లోబల్ పార్ట్స్ సెంటర్‌కు శంకుస్థాపన చేస్తారు. సుమారు రూ.750 కోట్ల పెట్టుబడితో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తుండటం గమనార్హం. కార్యక్రమం అనంతరం సీఎం చంద్రబాబు తిరుపతిలోనే బస చేస్తారు.

**రాయలసీమ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి**

జులై 2వ తేదీన తిరుపతి జిల్లా రైల్వే కోడూరులో "వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ ఆజీవికా మిషన్" (ఎదీ + =ూవీ +) ను ప్రారంభిస్తారు. అదే రోజు సాయంత్రం తిరుపతిలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో జరిగే జీఎస్‌డీపీ కెపాసిటీ బిల్డింగ్ వర్క్‌షాప్‌కు హాజరవుతారు. ఈ కీలక సమావేశంలో నీతి ఆయోగ్ సభ్యులతో పాటు ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి సభ్యులు కూడా పాల్గొననున్నారు. రెండో రోజు రాత్రి కూడా సీఎం తిరుపతిలోనే బస చేస్తారు. పర్యటనలో అత్యంత కీలకమైన ఘట్టంగా జులై 3వ తేదీన కడప జిల్లా పర్యటన ఉండనుంది. రాయలసీమ ప్రజల చిరకాల ఆకాంక్ష అయిన స్టీల్ ప్లాంట్ పనులకు జమ్మలమడుగు నియోజకవర్గంలోని సున్నపురాళ్లపల్లెలో ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టనున్నారు. రాయలసీమ స్టీల్ ప్లాంట్ పనులను లాంఛనంగా ప్రారంభించి, ఈ ప్రాంత పారిశ్రామిక అభివృద్ధికి బాటలు వేయనున్నారు.

**సొంత నియోజకవర్గంలో మూడు రోజులు**

స్టీల్ ప్లాంట్ పనులను ప్రారంభించిన అనంతరం, చంద్రబాబు తన సొంత నియోజకవర్గమైన కుప్పంకు బయలుదేరి వెళతారు. జులై 3వ తేదీ నుంచి 5వ తేదీ వరకు మూడు రోజుల పాటు కుప్పంలోనే ఉండి, పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారు. నియోజకవర్గ ప్రజలతో మమేకమై, స్థానిక సమస్యలను తెలుసుకుంటారు. మూడు రోజుల కుప్పం పర్యటన ముగించుకుని జులై 5వ తేదీన తిరిగి అమరావతికి చేరుకుంటారు. ఈ ఐదు రోజుల పర్యటన ద్వారా ఒకేసారి సంక్షేమం, పారిశ్రామిక అభివృద్ధి, నియోజకవర్గ సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించినట్లు స్పష్టమవుతోంది.

## అమెరికా దాచిన నిజం?.. ఇరాన్ దాడులతో భారీ నష్టం!

మొదటిపేజీ తరువాయి – భవిష్యత్తుపై పెంటగాన్ పునరాలోచిస్తున్నట్లు తెలుస్తోంది. 'వాల్ స్ట్రీట్ జర్నల్' కథనం ప్రకారం.. ఫిబ్రవరి చివరి నుంచి జూన్ మధ్య జరిగిన ఇరాన్ దాడుల్లో పశ్చిమాసియాలో కనీసం 20 అమెరికా సైనిక స్థావరాలు దెబ్బతిన్నాయి. ముఖ్యంగా బహ్రెయిన్‌లో ఉన్న అమెరికా నౌకాదళ ప్రధాన స్థావరం 'నేవల్ సపోర్ట్ యాక్టివిటీ'కు తీవ్ర నష్టం వాటిల్లింది. ఈ దాడుల్లో కమాండ్ హెడ్‌క్వార్టర్స్‌తో పాటు డజనుకు పైగా భవనాలు, రెండు శాటిలైట్ కమ్యూనికేషన్ టెర్మినల్స్ దెబ్బతిన్నట్లు నివేదిక పేర్కొంది. దాడుల సమయంలో ఎక్కువ మంది సిబ్బందిని ముందుగానే తరలించినందున ప్రాణనష్టం జరగలేదని అమెరికా సైన్యం తెలిపింది. ఈ పరిణామాల నేపథ్యంలో బహ్రెయిన్‌లోని స్థావరాన్ని పునర్వ్యవస్థీకరించడం, కువైట్, సౌదీ అరేబియాల్లో ఉనికిని తగ్గించడం, ఇరాన్ క్షిపణుల పరిధికి దూరంగా కొన్ని సైనిక కార్యకలాపాలను పశ్చిమ ప్రాంతాలకు తరలించే అంశాలను పెంటగాన్ పరిశీలిస్తున్నట్లు సమాచారం. అవసరమైతే భూగర్భ కమాండ్ కేంద్రాల ఏర్పాటుపైనా చర్చ జరుగుతున్నట్లు అధికారులు వెల్లడించారు. నష్టపోయిన భవనాల పునర్నిర్మాణానికే సుమారు 400 మిలియన్ డాలర్లు (దాదాపు రూ.3,400 కోట్లు) ఖర్చవుతుందని అంచనా. అయితే శిథిలాల తొలగింపు, అదనపు భద్రతా ఏర్పాట్ల ఖర్చు ఇందులో లేదని పేర్కొంది. ఇదే సమయంలో 'సెంటర్ ఫర్ స్ట్రాటజిక్ అండ్ ఇంటర్నేషనల్ స్టడీస్' అంచనా ప్రకారం ఈ యుద్ధం వల్ల మొత్తం వ్యయం సుమారు 40 బిలియన్ డాలర్లకు చేరగా, అందులో 2.2 నుంచి 5.1 బిలియన్ డాలర్ల వరకు అమెరికా సైనిక స్థావరాలకే నష్టం వాటిల్లినట్లు వెల్లడించింది.

## స్టాలిన్‌కు షాకిచ్చిన వైకో.. ఆయనకు ఝలక్ ఇచ్చిన సొంత పార్టీ నేతలు

మొదటిపేజీ తరువాయి – వైకో నేతృత్వంలోని ఎండీఎంకే తప్పుకున్న 24 గంటల వ్యవధిలోనే ఆ పార్టీకి కోలుకోలేని దెబ్బ తగిలింది. ఎండీఎంకేకు చెందిన 150 మందికి పైగా ముఖ్య నేతలు, జిల్లా కార్యదర్శులు, ఉన్నత స్థాయి కమిటీ సభ్యులు ఆదివారం డీఎంకే గూటికి చేరారు. చెన్నైలోని డీఎంకే ప్రధాన కార్యాలయం 'అన్నా అరివాలయం'లో జరిగిన ఈ ప్రత్యేక కార్యక్రమంలో డీఎంకే అధినేత, మాజీ ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ సమక్షంలో వీరంతా పార్టీలో చేరారు. వీరిలో శివగంగైకి చెందిన పులవర్ ఎస్. సేవంతియప్పన్, తిరువళ్లూరుకు చెందిన టి.ఆర్.ఆర్.సెంగుట్టువన్, ప్రచార కార్యదర్శి తిరుపరంకుంద్రం అళగుసుందరం, విరుదునగర్‌కు చెందిన ఆర్.ఎం.ఎస్. శేఖర్ వంటి ఎండీఎంకే అగ్రనేతలు ఉన్నారు. వీరితో పాటు డాక్టర్ అంబేద్కర్ లా యూనివర్సిటీకి చెందిన 40 మంది విద్యార్థి నేతలు కూడా డీఎంకేలో చేరడం గమనార్హం. ఈ ఆకస్మిక వలసలతో శివగంగై, తిరువళ్లూరు, విరుదునగర్, తిరుపూర్ వంటి కీలక జిల్లాల్లో డీఎంకే తన సంస్థాగత బలాన్ని మరింత పెంచుకుంది. అంతకుముందు శనివారం జరిగిన జనరల్ కౌన్సిల్ సమావేశంలో.. డీఎంకేతో ఉన్న తొమ్మిదేళ్ల బంధాన్ని తెంచుకుంటున్నట్లు ఎండీఎంకే ప్రకటించింది. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత ప్రజాతీర్పుకు వ్యతిరేకంగా, అన్నాడీఎంకే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు డీఎంకే తెరవెనుక రాజకీయ ఒప్పందాలు చేసుకుందని ఎండీఎంకే తీవ్ర ఆరోపణలు చేసింది. కూటమిలో తమకు తీవ్ర అవమానాలు జరిగాయని వైకో ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఒంటరిగానే నిర్ణయాలు తీసుకుంటామని, రాబోయే ఉప ఎన్నికల్లో ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) ప్రభుత్వానికి మద్దతు ఇస్తామని ప్రకటించారు. అయితే ఎండీఎంకే చేసిన ఆరోపణలను డీఎంకే తీవ్రంగా ఖండించింది.

## బంగారం కొనుగోళ్లు తగ్గించారు.. ప్రజలకు మోదీ ధన్యవాదాలు

మొదటిపేజీ తరువాయి – కొనుగోళ్లు తగ్గించడంతో పాటు ఇంధనాన్ని పొదుపు చేసిన భారతీయులకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం ప్రసారమైన 135వ 'మన్ కీ బాత్' రేడియో కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. అంతర్జాతీయ సంక్షోభ సమయంలో ప్రజలు కనబరిచిన ఈ సహకారం దేశ ఐక్యతకు, శక్తికి నిదర్శనమని కొనియాడారు. ప్రస్తుతం సీషెల్స్ పర్యటనలో ఉన్న ప్రధాని, అక్కడి నుండే ఈ కార్యక్రమం ద్వారా దేశప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. దేశ ఆర్థిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అనేక కుటుంబాలు నూతన బంగారు ఆభరణాల కొనుగోళ్లకు దూరంగా ఉండి, వివాహ వేడుకలకు పాత బంగారాన్నే పునర్వినియోగించడం అభినందనీయమన్నారు. అలాగే, అనేకమంది తమ విదేశీ పర్యటనలను వాయిదా వేసుకోవడం, కార్‌పూలింగ్ పాటించడం మరియు మెట్రో వంటి ప్రజా రవాణా వ్యవస్థలను ఆశ్రయించడం ద్వారా ఇంధనాన్ని ఆదా చేశారని ప్రశంసించారు. ఈ సామూహిక కృషి అంతర్జాతీయ వేదికపై భారతదేశ స్థానాన్ని మరింత బలోపేతం చేస్తుందని ప్రధాని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా జూన్ మాసంలో రక్షణ రంగంలో దేశం సాధించిన విజయాలను ప్రధాని ప్రత్యేకంగా ప్రస్తావించారు. అహ్మదాబాద్‌లో నిర్వహించిన వరల్డ్ యోగా ఆసనా ఛాంపియన్‌షిప్‌లో భారత క్రీడాకారులు కనబరిచిన అద్భుత ప్రతిభను ఆయన అభినందించారు. ఈ పోటీలలో భారత్ 102 స్వర్ణాలతో పాటు మొత్తం 114 పతకాలు సాధించి అగ్రస్థానాన్ని కైవసం చేసుకుందని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణతో పాటు ద్వీప దేశాల అభివృద్ధికి భారత్ అందిస్తున్న తోడ్పాటుకు గుర్తింపుగా, సీషెల్స్‌లో ప్రధాని 'గార్డియన్ ఆఫ్ ది బ్లూ హొరైజన్' పురస్కారాన్ని అందుకున్న విషయం తెలిసిందే.

### జాతీయ గ్రామీణాభివృద్ధి సదస్సులో పాల్గొన్న సీతక్క



మొదటిపేజీ తరువాయి – 100 శాతం వేతనాల విధానం కొనసాగించాలని, మెటీరియల్ కాంపోనెంట్‌కు 75 శాతం కేంద్ర వాటా ఉండాలని విజ్ఞప్తి చేశారు. పీఎం ఆవాస్ యోజన కింద గత బీఆర్ఎస్ ప్రభుత్వం వద్దనడంతో కేటాయింపులు లేవని... ఆ పథకం కింద తక్షణమే గృహాలు మంజూరు చేయాలని సీతక్క కోరారు. పీఎంజీఎస్‌వై రోడ్లకు అటవీ అనుమతులు ప్రధాన అడ్డంకిగా ఉన్నాయని, కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు వినతిపత్రం అందజేశామని తెలిపారు. తెలంగాణలో జల్ సంచార్ విభాగంలో 13 జాతీయ అవార్డులు సాధించడం కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని సీతక్క పేర్కొన్నారు.

## ఇక్కడున్నది మోదీ-చంద్రబాబు-పవన్ అని గుర్తుంచుకోవాలి



మొదటిపేజీ తరువాయి – జనసేన అధినేత పవన్ కల్యాణ్ హుషారుతో రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపిస్తున్నామని చంద్రబాబు తెలిపారు. 2024 ఎన్నికల్లో ప్రజలు కూటమికి చారిత్రక విజయాన్ని అందించారని, ప్రస్తుతం ఆ ప్రజాదరణ మరింత పెరిగిందని ఆయన పేర్కొన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కూటమిదే ఘనవిజయమని ధీమా వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో పల్లెలు నిర్లక్ష్యానికి గురయ్యాయని, కనీస సౌకర్యాల కల్పనకు కూడా నిధులు లేని దుస్థితి నెలకొందని విమర్శించారు. గత ఐదేళ్లలో కేవలం 880 కిలోమీటర్ల సీసీ రోడ్లు మాత్రమే నిర్మిస్తే, తమ ప్రభుత్వం కేవలం రెండేళ్ల వ్యవధిలోనే 6,500 కిలోమీటర్ల రోడ్లను నిర్మించిందని చంద్రబాబు వివరించారు. రాష్ట్రంపై రూ.10 లక్షల కోట్ల అప్పుల భారం, ఖాళీ ఖజానా ఉన్నప్పటికీ, 'సూపర్ సిక్స్' వంటి సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని చెప్పారు. వెలిగొండ ప్రాజెక్టు రెండో దశను పూర్తి చేసి ఉదయగిరి నియోజకవర్గానికి సాగు, తాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు.

# రాముడు-శివుడిపై సీఎం రేవంత్ రెడ్డి కామెంట్స్

మొదటిపేజీ తరువాయి – ఉత్తర, దక్షిణ భారతదేశ ప్రజల మధ్య మత, రాజకీయ పరమైన గుర్తింపులపై ఆయన చేసిన విశ్లేషణ పెద్ద వివాదానికి దారితీసింది. రాజకీయ లబ్ధి కోసం రేవంత్ రెడ్డి సమాజంలో చిచ్చు పెట్టే ప్రయత్నం చేస్తున్నారని బీజేపీ తీవ్రంగా విమర్శించింది.

**ఏం జరిగిందంటే..!**

జాతీయ రాజధాని ఢిల్లీలో జరిగిన ఒక మీడియా కార్యక్రమంలో పాల్గొన్న రేవంత్ రెడ్డి, బీజేపీ నినాదాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ సహా బీజేపీ నేతలు పదే పదే 'జై శ్రీరామ్' అని ఎందుకు అంటారని, అదే తరహాలో 'హర హర మహాదేవ్' అని ఎందుకు నినదించరని ఆయన ప్రశ్నించారు. "మేం ద్రావిడులం. ఇక్కడి (ఉత్తర భారతదేశం) ప్రజలు ఆర్యులు. మేం శివ భక్తులం, ఇక్కడి ప్రజలు శ్రీరాముడి భక్తులు. బీజేపీ రాముడిని దొంగిలించింది. అది ఒక భావోద్వేగం. మోదీ గారు 'హర హర మహాదేవ్' అని ఎందుకు అనరు? బీజేపీ నేతలు వేదికపై ఆ నినాదం చేయడం మీరు ఎప్పుడైనా చూశారా? వాళ్లు కేవలం 'జై శ్రీరామ్' అంటారు. మేం 'హర హర మహాదేవ్' అంటే వారికి నచ్చదు" అని రేవంత్ రెడ్డి అన్నారు. శివుడిని 'పేదల దేవుడు' అని, రాముడిని 'ధనవంతుల దేవుడు' అని అభివర్ణించిన ఆయన, ఇద్దరు దేవుళ్లను ప్రజలు ఆరాధిస్తారని కూడా స్పష్టం చేశారు. ఉత్తర, దక్షిణ భారతదేశ రాజకీయ సంస్కృతులు, సామాజిక గుర్తింపుల మధ్య విస్తృతమైన తేడాలు ఉన్నాయనే వాదనకు బలం చేకూర్చే క్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

**తీవ్రంగా స్పందించిన బీజేపీ**

రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై బీజేపీ తీవ్రంగా స్పందించింది. కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఆదేశాల మేరకే రేవంత్ రెడ్డి ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించింది. బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారీ మాట్లాడుతూ.. ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే హిందువులను విభజించేందుకు రేవంత్ ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. "రాహుల్ గాంధీ సూచనల మేరకు, హిందువులను విభజించడానికి కొత్త మార్గం కనుగొనే ప్రయత్నంలో భాగంగానే రేవంత్ ఈ వ్యాఖ్యలు చేశారు" అని ప్రదీప్ భండారీ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. కాంగ్రెస్ పార్టీని 'ఆధునిక ముస్లిం లీగ్ కాంగ్రెస్' అని అభివర్ణించిన ఆయన, రాముడు, శివుడి అనుచరుల మధ్య చిచ్చు పెట్టే కుట్రలు ఫలించవని హెచ్చరించారు. గతంలో కాంగ్రెస్ పార్టీ అనేక మతపరమైన, ఆలయ సంబంధిత కార్యక్రమాలను వ్యతిరేకించిందని ఆయన గుర్తుచేశారు. "సోమనాథ్ ఆలయ నిర్మాణాన్ని, కాశీ విశ్వనాథ్ ధామ్ కారిడార్‌ను కాంగ్రెస్ వ్యతిరేకించిన విషయం దేశం మరిచిపోలేదు. 2018లో 'హర హర మహాదేవ్' అని నినదించినందుకు ముగ్గురు పార్టీ కార్యకర్తలను సస్పెండ్ చేసింది" అని భండారీ ఆరోపించారు. బీజేపీ నేతలు 'హర హర మహాదేవ్' అని నినదించరన్న రేవంత్ వాదనను ఆయన తోసిపుచ్చారు. "ప్రధాని మోదీ 'జై శ్రీరామ్'తో పాటు 'హర హర మహాదేవ్' అని కూడా నినదించే ఏకైక ప్రధానమంత్రి. లంకకు వెళ్లే ముందు శ్రీరాముడు స్వయంగా మహాదేవుడికి పూజలు చేశాడని రామాయణంలోని లంకాకాండలో ఉంది. ఓటు బ్యాంకు రాజకీయాలు చేసేవారికి ఈ విషయం కూడా తెలియదు" అని ఆయన ఎద్దేవా చేశారు. మొత్తంగా రేవంత్ వ్యాఖ్యలు బీజేపీ, కాంగ్రెస్ మధ్య మాటల యుద్ధానికి దారితీశాయి.

# బుల్లెట్ ట్రైన్ పేరుతో రియల్ ఎస్టేట్ దందా



మొదటిపేజీ తరువాయి – ఎస్టేట్ కుంభకోణానికి పాల్పడుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆరోపణలు చేశారు. తమ పార్టీ అభివృద్ధికి గానీ, బుల్లెట్ ట్రైన్‌కు గానీ వ్యతిరేకం కాదని, కానీ దాని ముసుగులో రైతుల భూములను లాక్కోవాలని చూస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. శంషాబాద్ విమానాశ్రయం వద్ద వేల ఎకరాల ప్రభుత్వ భూమి అందుబాటులో ఉండగా, తరతరాలుగా రైతులు సాగు చేసుకుంటున్న బహదూర్‌పల్లి వ్యవసాయ భూములను ఎందుకు సేకరిస్తున్నారని కేటీఆర్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఒక రైల్వే స్టేషన్ కోసం వెయ్యి ఎకరాలు అవసరమా? అని నిలదీశారు. రైతుల భూములపై సుమారు 4,000 మంది పోలీసులను మోహరించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. "ప్రభుత్వం వద్ద సరైన పత్రాలు ఉంటే వాటిని రైతులకు చూపించాలి, అంతేకానీ పోలీసులను పెట్టి భయపెట్టడం ఎందుకు?" అని సీఎం రేవంత్ రెడ్డిని ఉద్దేశించి ప్రశ్నించారు. "ఏడాదిన్నరలో మీ ఆశీస్సులతో కేసీఆర్ తిరిగి అధికారంలోకి వస్తారు. మీ పట్టాలు మీకే ఇప్పిస్తాం. మీకోసం హైకోర్టుకు వెళ్లిన కార్తీక్ రెడ్డి ద్వారానే మీకు పట్టాలు అందేలా చూస్తాం," అని రైతులకు కేటీఆర్ భరోసా ఇచ్చారు. రైతులు అధైర్యపడొద్దని, ఐక్యంగా ఉండాలని సూచించారు. రైతులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ రాజకీయంగా, న్యాయపరంగా అండగా నిలుస్తుందని ఆయన హామీ ఇచ్చారు.

# గిరిజనుల సంక్షేమానికి, అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

పారదర్శక పాలనతోనే గిరిజనులకు న్యాయం

గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతులు, విద్యాభివృద్ధిపై ఐటీడీఏ సుదీర్ఘ సమీక్ష

ప్రతి 3 నెలలకోసారి పాలకవర్గ సమావేశం నిర్వహిస్తాం

సుధూర ప్రాంతాల్లోని గిరిజనుల కోసం ప్రత్యేక బస్సులు

ఐటీడీఏ 78వ పాలకవర్గ సమావేశం ప్రశాంతం: గిరిజనాభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేసిన మంత్రులు, అధికారులు









**సీతంపేట,నిజం న్యూస్ సెప్టెంబర్ 29 :** గిరిజనుల సంక్షేమానికి, అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఇందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర మహిళ, శిశు సంక్షేమ మరియు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి స్పష్టం చేశారు. వివిధ శాఖల ద్వారా అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ముందుగా ఆయా నియోజకవర్గ ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లాలని మంత్రి ఆదేశించారు. అధికార యంత్రాంగం పారదర్శక పాలనతోనే గిరిజనులకు న్యాయం జరుగుతుందన్నారు. ఇకపై ప్రతి 3 నెలలకు ఒకసారి ఐటిడిఏ పాలకవర్గ సమావేశాన్ని నిర్వహిస్తామని, తద్వారా గిరిజన ప్రజల సమస్యలు పరిష్కారం కాగలవని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. సీతంపేట సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ 78వ పాలకవర్గ సమావేశం ఐటిడిఏ సమావేశ మందిరంలో మంగళవారం జరిగింది. ఈరోజు సమావేశానికి రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశంలో పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్. ప్రభాకర రెడ్డి, శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ , పార్వతీపురం జాయింట్ కలెక్టర్ ఆర్.వైశాలి, సీతంపేట ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి పవార్ స్వప్నిల్ జగన్నాథ్, శ్రీకాకుళం జిల్లా శాసనసభ్యులు, ప్రజాప్రతినిధులు, ఉమ్మడి జిల్లాల అధికారులు పాల్గొన్నారు. గిరిజన ప్రాంతాల్లో అమలవుతున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి పనులపై సుదీర్ఘంగా సమీక్షించిన మంత్రి, ప్రభుత్వ పథకాలు, నిధులు పారదర్శకంగా అర్హులైన ప్రతి గిరిజనుడికి అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ మాట్లాడుతూ, ప్రతి మూడు నెలలకోసారి క్రమం తప్పకుండా రాజ్యాంగబద్ధంగా సమావేశాలు నిర్వహించాలని, కలెక్టర్లు లేదా అధికారుల ఇతర పనుల వల్ల ఇవి వాయిదా పడకూడదని సూచించారు. నియోజక వర్గాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, లబ్ధిదారుల ఎంపిక, ఆమోదం వివరాలను స్థానిక ఎమ్మెల్యేలకు తప్పనిసరిగా అందించాలని, పారదర్శకత లోపిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. అలాగే గిరిజన రైతులకు సంబంధించిన ఆర్వోఎఫ్ఆర్, డి-పట్టా భూముల మ్యుటేషన్, ఆధార్ సీడింగ్ ప్రక్రియలను వేగవంతం చేయడానికి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని ఆదేశించారు. సరిహద్దు ప్రాంతాల నుండి వచ్చే అక్రమ చొరబాట్లను, నకిలీ కార్డుల దందాను అరికట్టేందుకు చట్టాన్ని కఠినంగా అమలుచేయాలని ప్రతిపాదించారు. సీతంపేట ఐటీడీఏ పరిధిని రాబోయే మూడేళ్లలో 'పసుపు హబ్'గా మార్చేందుకు కృషి చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. 1,000 ఎకరాలలో కేరళ పైనాపిల్ సాగును ప్రోత్సహించేందుకు స్థానిక రైతులను కేరళకు అధ్యయన పర్యటనకు పంపి మొక్కలను తెప్పించినట్లు ఎమ్మెల్యే గుర్తుచేశారు. పసుపులో కుర్కుమిన్ శాతం పెంపునకు, అంతర్జాతీయ మార్కెట్ ప్రమాణాలకు అనుగుణంగా నాణ్యమైన విత్తనాలు, సాంకేతిక సలహాలు అందించాలని ఎమ్మెల్యేలు కోరారు. వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా 198 యూనిట్ల పవర్ వీడర్లు, టిల్లర్లను పంపిణీ చేశామని అధికారులు తెలిపారు. నిలిచిపోయిన పాత బడ్జెట్ విడుదల, పథకాల రీ-వాలిడేషన్ ఆలస్యంపై ప్రతినిధుల ప్రశ్నలకు అధికారులు వివరణలు ఇచ్చారు. గిరిజన విద్యాసంస్థలు, గురుకులాలు, పోస్ట్-మెట్రిక్ హాస్టళ్ల నిర్వహణపై సమావేశంలో సుదీర్ఘ చర్చ జరిగింది. పదో తరగతి, ఇంటర్ ఫలితాల్లో శ్రీకాకుళం గిరిజన ప్రాంతాల్లో ఉత్తీర్ణత శాతం తగ్గడంపై ఆరా తీసిన మంత్రి, పర్యవేక్షణ లోపాలు సరిదిద్ది మెరుగైన ఫలితాలను సాధించేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యం కోసం తాగునీటి ఆర్వో ప్లాంట్లు, మరుగుదొడ్లు, నిరంతర ఆరోగ్య పర్యవేక్షణ తప్పనిసరి చేశామని మంత్రి పేర్కొన్నారు. గిరిజన బాలికల వసతి గృహాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధంగ ఉన్నాయని, త్వరలో సిద్ధం చేస్తామన్నారు. శ్రీకాకుళం జిల్లాలో ఐటీడీఏ కార్యాలయం ప్రత్యేకంగా లేనందున ఇచ్ఛాపురం, పలాస, పాతపట్నం వంటి సుధూర ప్రాంతాల్లోని గిరిజనులు ఆయా ప్రాంతాల నుంచి సీతంపేటకు చేరుకునేలా ప్రత్యేక బస్సులు నడపాలని నిర్ణయించారు. గ్రీవెన్స్‌కు వచ్చే వారికి అన్న కాంటీన్ ద్వారా భోజన సదుపాయం కల్పించాలన్నారు. ప్రతి నెలా నాల్గవ సోమవారం ఒక్కో నియోజకవర్గంలో ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించాలని, తద్వారా నియోజకవర్గ స్థాయిలో ఉండే సమస్యలు అక్కడికక్కడే పరిష్కారం కాగలవని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా ఉమ్మడి జిల్లాల్లో సగంలో నిలిచిపోయిన రహదారి పనులను జీ రాంజీ కింద పూర్తి చేయడం జరుగుతుందని మంత్రి హామీ ఇచ్చారు. అలాగే గిరిజన ప్రాంతాల్లోని రహదారులకు ఇరువైపులా రక్షణ గోడలను నిర్మించాలని, తద్వారా ప్రమాదాలను నివారించవచ్చని పాలకొండ శాసనసభ్యులు నిమ్మక జయకృష్ణ సూచించారు. గిరిజన ప్రాంతాల్లో నిరుపయోగంగా ఉన్న హాత్ బజార్లు, ప్రభుత్వ భవనాలను జిసిసి నిల్వలకు, విక్రయాలకు అనుకూలంగా ఉండేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వైద్య ఆరోగ్యం సమీక్షలో కుటుంబ సంక్షేమం, జనాభా రేటు, వైద్య సేవలు, ప్రభుత్వ పథకాలు మరియు ఇతర పాలనాపరమైన అంశాలపై ప్రధానంగా చర్చించారు. గతంలో ఒకే బిడ్డ ఉన్న కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొనేవారని, కానీ ప్రస్తుతం సంతానోత్పత్తి రేటు తగ్గుతుండటం గమనించాల్సిన విషయమని తెలిపారు. రాష్ట్రంలో సంతానోత్పత్తి రేటు సుమారు 1.6 గా ఉందని, ఇది కనీసం 2.2 ఉండాలని, ఎక్కువ మంది పిల్లలను కనడంపై కూడా ప్రతి ఒక్కరూ బహిరంగంగా అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం డిఆర్డిఎ, గ్రామీణ నీటి సరఫరా, విద్యాశాఖ తదితర శాఖల ప్రగతిపై సమీక్షించారు.

# ప్రజారోగ్య సేవా లో రాందేవ్ హాస్పిటల్ ముందంజ

ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా వాక్ దాన్..

ఉచిత కార్డియాలజీ వైద్య శిబిరం.. 406 మందికి ఉచిత వైద్య సేవ





**నిజం న్యూస్ కూకట్పల్లి ప్రతినిధి, సెప్టెంబర్ 29:** ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా వాకథాన్, ఉచిత కార్డియాలజీ వైద్య శిబిరం ౖ సేవలు పొందిన 406 మంది ప్రపంచ హృదయ దినోత్సవాన్ని పురస్కరించుకుని రామ్‌దేవ్‌రావు హాస్పిటల్ ఆధ్వర్యంలో వాకథాన్, ఉచిత కార్డియాలజీ వైద్య శిబిరం నిర్వహించారు. హృదయ సంబంధిత వ్యాధులపై ప్రజల్లో అవగాహన పెంచడం, ముందస్తు వైద్య పరీక్షల ప్రాధాన్యాన్ని తెలియజేయడం ఈ కార్యక్రమాల లక్ష్యమని హాస్పిటల్ యాజమాన్యం తెలిపింది. వరల్డ్ హార్ట్ ఫెడరేషన్ కార్యక్రమంలో భాగంగా, కుముదినీదేవి కాలేజ్ ఆఫ్ నర్సింగ్ మరియు లయన్స్ క్లబ్ ఆఫ్ సనాతన సహకారంతో వాకథాన్ నిర్వహించారు. ప్రముఖ రేకీ థెరపీ గ్రాండ్ మాస్టర్, రచయిత్రి, ఫ్యామిలీ కౌన్సిలర్ మరియు సామాజిక కార్యకర్త లక్ష్మీ కమలాకర్ పచ్చజెండా ఊపి వాకథాన్‌ను ప్రారంభించారు. నిత్యం వ్యాయామం చేయడం, సమతుల ఆహారం తీసుకోవడం, ఆరోగ్యకరమైన జీవనశైలిని పాటించడం ద్వారా హృదయ ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని ఈ సందర్భంగా ప్రజలకు వివరించారు. వాకథాన్‌లో గైనకాలజిస్టులు డా. చాయాదేవి, డా. ప్రమోదిని, డా. మంజుల, డా. సుమన్ లత; కార్డియాలజిస్టులు డా. ప్రదీప్ రెడ్డి, డా. శ్రీకాంత్; రేడియాలజిస్టులు డా. లోకేష్ రెడ్డి, డా. మౌనిక; ఈఆర్ ఫిజీషియన్లు డా. స్వాతి రెడ్డి, డా. సుమ, డా. వీరభద్ర; పాథాలజిస్టులు డా. పావని, డా. చందన పాల్గొన్నారు. వీరితో పాటు డా. సుధారాణి (అనస్థీషియా), డా. డి. నాగేంద్ర (పల్మనాలజిస్ట్), డా. రోహిత్ నాయక్ (న్యూరో సర్జన్), డ్యూటీ డాక్టర్లు, నర్సింగ్ సిబ్బంది, నర్సింగ్ విద్యార్థులు మరియు ఇతర హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు. వాకథాన్ అనంతరం వైద్యులు గుండె జబ్బుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని, రక్తపోటు మరియు రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రణలో ఉంచుకోవాలని సూచించారు. రామ్‌దేవ్‌రావు హాస్పిటల్‌లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించిన ఉచిత కార్డియాలజీ వైద్య శిబిరంలో బీపీ, జీఆర్‌బీఎస్ (రక్తంలో చక్కెర), ఈసీజీ, 2డీ ఎకో పరీక్షలతో పాటు కార్డియాలజీ వైద్యుల సంప్రదింపులను అందించారు. శిబిరానికి విశేష స్పందన లభించగా, మొత్తం 406 మంది ఉచిత వైద్య సేవలను వినియోగించుకున్నారు. రామ్‌దేవ్‌రావు హాస్పిటల్ మేనేజ్‌మెంట్ మార్గదర్శకత్వంలో, డా. కమలాకర్, డా. ప్రదీప్ రెడ్డి మరియు డా. యోబు ఆధ్వర్యంలో కార్యక్రమాలు విజయవంతంగా జరిగాయి. సహకరించిన వైద్యులు, హాస్పిటల్ సిబ్బంది, నర్సింగ్ విద్యార్థులు, లయన్స్ క్లబ్ సభ్యులు, పాల్గొన్న ప్రజలందరికీ నిర్వాహకులు ధన్యవాదాలు తెలిపారు. "ప్రజల ఆరోగ్యం -- మా బాధ్యత" అనే స్ఫూర్తితో సామాజిక సేవా కార్యక్రమాల్లో ఎల్లప్పుడూ ముందంజలో ఉంటామని, భవిష్యత్తులోనూ ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు మరియు ఉచిత వైద్య శిబిరాలను కొనసాగిస్తామని హాస్పిటల్ యాజమాన్యం పేర్కొంది.

# గాజులరామారం ప్రాంతంలో సీఎంసీ కమిషనర్ క్షేత్రస్థాయి తనిఖీ

మోడల్స్ స్మశాన వాటిక, సర్కిల్ కార్యాలయం, స్పోర్ట్స్ కాంప్లెక్స్ పనులపై సమీక్ష

**నిజం న్యూస్ సైబరాబాద్ ప్రతినిధి, సెప్టెంబర్ 29:** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) కమిషనర్ గాజులరామారం ప్రాంతంలో ఉదయం క్షేత్రస్థాయి తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఇంజినీర్లు, సర్కిల్ సిబ్బందితో కలిసి కీలక పౌర మౌలిక వసతుల పనులు, ప్రతిపాదిత అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు.

**శాపూర్‌లోని కలావతి నగర్‌లో మోడల్ శ్మశానవాటిక**

శాపూర్‌లోని కలావతి నగర్‌లో ప్రతిపాదించిన మోడల్ శ్మశానవాటికను కమిషనర్ పరిశీలించారు. ఇందులో ప్రతిపాదించిన గ్యాలరీ, టాయిలెట్ కాంప్లెక్స్, పరిపాలనా భవనం, నడక మార్గాలు, అంత్యక్రియల కోసం ఏర్పాటు చేయనున్న సౌకర్యాలను సమీక్షించారు. ప్రతిపాదిత పనులను ప్రణాళిక ప్రకారం ముందుకు తీసుకెళ్లి, క్షేత్రస్థాయిలో సకాలంలో చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.



**గాజులరామారం సర్కిల్ కార్యాలయం**

కొత్త గాజులరామారం సర్కిల్ కార్యాలయ భవనం నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదన, ప్రణాళికను కమిషనర్ పరిశీలించారు. భవన నిర్మాణ పనులను వెంటనే చేపట్టి, అవసరమైన తదుపరి చర్యలను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

**గాజులరామారం స్పోర్ట్స్ కాంప్లెక్స్**

గాజులరామారం స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను కమిషనర్ పరిశీలించి, అందుబాటులో ఉన్న సౌకర్యాలను త్వరితగతిన ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. అదనంగా స్విమ్మింగ్, స్కేటింగ్ వంటి సౌకర్యాలను ఏర్పాటు చేసి కాంప్లెక్స్‌ను మరింత వినియోగదారులకు ఉపయోగపడేలా అభివృద్ధి చేయాలని సూచించారు. ప్రతిపాదిత పనులను సమన్వయంతో ముందుకు తీసుకెళ్లి, ప్రతి పనిపై క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తూ సకాలంలో అమలు మరియు తదుపరి చర్యలు ఉండేలా చూడాలని కమిషనర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

# సయోధ్య ద్వారానే కేసులకు శాశ్వత పరిష్కారం








**శ్రీకాకుళం, నిజం న్యూస్ సెప్టెంబర్ 28:** కోర్టులలో సుదీర్ఘకాలంగా పేరుకుపోయిన సివిల్, క్రిమినల్ కేసులకు మధ్యవర్తిత్వం ద్వారానే త్వరితగతిన శాశ్వత పరిష్కారం లభిస్తుందని శ్రీకాకుళం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె. హరిబాబు స్పష్టం చేశారు. నల్సా, సుప్రీంకోర్టు మధ్యవర్తిత్వ, సయోధ్య ప్రాజెక్టు కమిటీ ఆదేశాల మేరకు అక్టోబర్ 1 నుండి డిసెంబర్ 31 వరకు 90 రోజుల పాటు నిర్వహించనున్న 'మీడియేషన్ ఫర్ ది నేషన్ క్యాంపెయిన్ 3.0' ప్రత్యేక ప్రచారంపై మంగళవారం ఆయన అధ్యక్షతన న్యాయవాదులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో నిర్వహించిన మొదటి, రెండవ విడత క్యాంపెయిన్లలో జిల్లా మంచి ఫలితాలు సాధించిందని, ఈ మూడవ విడతలో అంతకుమించి గరిష్ట సంఖ్యలో కేసులను పరిష్కరించి శ్రీకాకుళం జిల్లాను ముందంజలో ఉంచాలని పిలుపునిచ్చారు. సయోధ్య విధానంలో కేసులు పరిష్కరించుకోవడం వల్ల సమయంతో పాటు ధనం ఆదా అవుతుందని, చెల్లించిన కోర్టు ఫీజు కూడా తిరిగి వస్తుందని హరిబాబు వివరించారు. ఇరువర్గాల మధ్య శత్రుత్వం పోయి స్నేహపూర్వక సంబంధాలు కొనసాగుతాయని, ఇక్కడ కుదిరిన రాజీ తీర్పుకు కోర్టు డిక్రీతో సమానమైన చట్టబద్ధత ఉంటుందని తెలిపారు. వైవాహిక, కుటుంబ, ఆస్తి వివాదాలు, చెక్ బౌన్స్, మోటార్ ప్రమాద పరిహారం, కార్మిక, వాణిజ్య మరియు రాజీకి వీలైన క్రిమినల్ కేసులను ఈ 90 రోజుల క్యాంపెయిన్ ద్వారా పరిష్కరించుకోవచ్చని సూచించారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, వివరాలకు 15100 టోల్ ఫ్రీ నంబరును సంప్రదించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లాలోని సీనియర్, ప్యానెల్, మధ్యవర్తిత్వ న్యాయవాదులు పాల్గొన్నారు.

# సున్నం చెరువు, తిమ్మిడి కుంట అభివృద్ధి... పనులపై సంయుక్త సమన్వయ సమావేశం



**నిజం న్యూస్ సైబరాబాద్ ప్రతినిధి, సెప్టెంబర్ 29;** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) కమిషనర్ ఛాంబర్‌లో సీఎంసీ కమిషనర్, హైడ్రా కమిషనర్‌తో పాటు సీఎంసీ, హైడ్రా, హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ సీనియర్ అధికారులు సంయుక్త సమన్వయ సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి చేతుల మీదుగా జరగనున్న ప్రారంభోత్సవాన్ని దృష్టిలో ఉంచుకుని చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై సమావేశంలో సమీక్ష నిర్వహించారు.

**సున్నం చెరువు**

సున్నం చెరువు వద్ద చేపట్టాల్సిన పలు పనులను అధికారులు సమీక్షించారు. ఇందులో ఇప్పటికే ఉన్న కల్వర్ట్ వరకు సెంట్రల్ మీడియన్‌ను పొడిగించడం, సున్నం చెరువు నుంచి కల్వర్ట్ వరకు ఫుట్‌పాత్‌ను విస్తరించడం, చెరువు పరిసరాల్లో అలంకరణ లైటింగ్ మరియు వీధి దీపాల ఏర్పాటు, అలాగే పర్వత్ నగర్ నుంచి సున్నం చెరువుకు రహదారి కనెక్టివిటీ కల్పించడం వంటి పనులు ఉన్నాయి.

**తిమ్మిడి కుంట**

తిమ్మిడి కుంట వద్ద వెనుక ప్రవేశ ద్వారం నుంచి ఏసీ బస్ స్టాప్ వరకు ఫుట్‌పాత్ కనెక్టివిటీ, చెరువు పరిసరాల్లో అలంకరణ లైటింగ్, సింధు హాస్పిటల్‌కు అనుసంధాన రహదారి మరియు తిమ్మిడి కుంట నుంచి స్మైలైన్ డెంటల్ వైపు ఉన్న అవుట్‌లెట్ డ్రెయిన్‌కు రిటైనింగ్ వాల్ నిర్మాణానికి సంబంధించిన పనులను సమావేశంలో సమీక్షించారు. గుర్తించిన అన్ని పనులపై సంబంధిత శాఖలు పరస్పరం సమన్వయంతో పనిచేసి, అవసరమైన చర్యలను వెంటనే చేపట్టి, నిర్దేశిత పనులను సకాలంలో పూర్తి చేయాలని అధికారులు ఆదేశించారు.

# అనధికార నిర్మాణాలపై సీఎంసీ ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలు ముమ్మరం

15 నిర్మాణాలు కూల్చివేత... రెండు నోటీసులు జారీ







నిజం న్యూస్ సైబరాబాద్ ప్రతినిధి, సెప్టెంబర్ 29; సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) పరిధిలో అనధికార నిర్మాణాలను గుర్తించి, భవన నిర్మాణ నిబంధనల అమలును నిర్ధారించేందుకు మూడు జోన్లలో సీఎంసీ బృందాలు క్షేత్రస్థాయిలో తనిఖీలు మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలను కొనసాగించాయి. నేటి ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రైవ్‌లో భాగంగా 15 అనధికార నిర్మాణాలను గుర్తించి, 15 కూల్చివేతలు చేపట్టగా, 2 నోటీసులు జారీ చేశారు. జోన్‌ల వారీగా చేపట్టిన కూల్చివేతల వివరాలు:

**సెరిలింగంపల్లి జోన్: 5**

**కూకట్‌పల్లి జోన్: 4**

**కుత్బుల్లాపూర్ జోన్: 6**

మూడు జోన్లలోనూ అనధికార నిర్మాణాల గుర్తింపు నుంచి తదుపరి చర్యల వరకు క్షేత్రస్థాయిలో ఎన్‌ఫోర్స్‌మెంట్ కొనసాగుతోంది. గుర్తించిన ప్రతి కేసును నిర్దేశిత విధానం మరియు అమల్లో ఉన్న నిబంధనల ప్రకారం అవసరమైన చర్యలకు తీసుకెళ్తున్నారు. ప్రతి గుర్తించిన కేసుపై నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తూ, సకాలంలో తదుపరి చర్యలు చేపట్టాలని సీఎంసీ కమిషనర్ సంబంధిత బృందాలను ఆదేశించారు. అనధికార నిర్మాణాలను నియంత్రించేందుకు సీఎంసీ పరిధిలో సమన్వయంతో తనిఖీలు, ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలు కొనసాగనున్నాయి.

# న్యూసెన్స్ చేసిన వ్యక్తులకు స్వచ్ఛభారత్ పనిష్మెంట్







**నిజం న్యూస్ ప్రతినిధి, మేడిపల్లి,సెప్టెంబర్ 29 :** మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని గురువారం నాడు బి. వంశీ తండ్రి:కృష్ణ వయస్సు: 20 సం.రాలు, వి అరవింద్ తండ్రి: అంజయ్య వయస్సు: 21 సం.రాలు, ఆదివారం నాడు ఐ శ్రీయన్ష్ తండ్రి: కుమార్ వయస్సు: 20 సం.రాలు వారు పైన తెలిపిన వ్యక్తులు మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో న్యూసెన్స్ చేయడం వలన అట్టి వారిపై కేసు నమోదు చేసి కోర్టు ముందు హాజరు పరచగా, గౌరవనీయులైన జడ్జి వారు గంటసేపు స్వచ్ఛభారత్ చేయవలసిందిగా ఆదేశించడం జరిగింది.

# జాయ సేనాపతి

చారిత్రక కాల్పనిక నవల



నీలాంబ ఉరివేసుకుని చనిపోయిన మరునాడే.. కళామందిరానికి వచ్చింది లలితాంబ. వెళ్లి దూరంగా కొందరు మహిళా కవయిత్రుల మధ్య కూర్చుంది. ఎక్కడో ఇద్దరి చూపులూ కలుసుకున్నాయి.. విడిపోయాయి. ఇద్దరి మధ్య పూర్తి నిశ్శబ్దం! అదొక నృత్త విన్యాసం.. దాని అర్థం ఆ పరమేష్టికే తెలియాలి!! జీవితం.. కనీసపు శారీరకతృష్ణ కూడా తీరని ఓ ఎండిన మోడుగానే బతుకు ముగిసిపోతుందా!? నీలాంబక్కను తల్పంపై అలా చూసేసరికి ఆరోజు లలితాంబ చేతిని తన గుండెకు తాకించడం తప్పయిందా?.. అప్పటికే తమమధ్య ఆమె కోరుకున్న భోగినీ పండుగ జరిగినట్లు భావించి ఆ సంతోషంలో.. శారీరక బాధల నుంచి విముక్తి కోరుకుని ఉరి వేసుకుందా!? అది కూడా ఖర్మకొద్దీ ఆ రోజునే.. ప్చ్! నీలాంబ మరణం కలిగించిన లోలోన ఘర్షణను మర్చిపోవడానికి అన్నట్లు ఈ పెళ్లిపనులు మీదికెత్తుకున్నాడు జాయచోడుడు. రాత్రింబవళ్లు మరో ఆలోచన రాకుండా అన్నీ తానై నిర్వహిస్తున్నాడు.కాకతీయ సామంత రాజ్యాలన్నీ కూడా గణపాంబ వివాహం తెచ్చిన ఉత్సవ వాతావరణంతో సంబరాలను జరుపుకొంటున్నాయి. సంబరాలతో పులకించిపోతోంది అనుమకొండ మహానగరం. నగరమంతా చలువ తాటాకులతో పెళ్లిపందిరులు వేస్తున్నారు. ఇక కాకతీయకోట, అందులో ఉన్న నియోగాలు, భవనాలు, రాజప్రాసాదాలు, రాజనగరి అన్నిటా సంతోష సందడులే. రాజనగరి మరీమరీ వెలిగిపోతోంది. రాజ్యమంతటా ఆనందసంద్రాలు పొంగి పొరలుతున్నాయి. పెళ్లి బరువు బాధ్యతల నడుమ కాబోయే కాకతీయ వారసులపై ఓ కన్నేసి ఉంచాడు జాయచోడుడు. ముఖ్యంగా పెద్ద మేనల్లుడు రుద్రమదేవుడు, రెండవ మేనల్లుడు మురారిదేవుడు.. వాళ్లిద్దరి కదలికలు, ఉత్సాహ ఉద్వేగాలు.. పెళ్లి సంబరాల్లో వాళ్ల ఆటపాటలు.. అన్నీ పరిశీలిస్తున్నాడు. హరిహరుడు, మురారి విసురునాడులోని గురుకులంలో యుద్ధవిద్యలు అభ్యసిస్తుండగా.. హరిహరుడు కాలధర్మం చెందాడు. మురారి అక్కడే చదువు కొనసాగిస్తున్నాడు. గణపాంబ పూర్తిగా రాజప్రాసాదంలోనే రాజగురువుల వద్ద చదువుకుంటుండగా.. రుద్రమదేవుడు త్రిపురాంతకం గోళకిమఠంలోని విద్యాకేంద్రంలో చదువుతున్నాడు. చదువుతోపాటు యుద్ధవిద్యల్లో కూడా నిష్ణాతుడని విన్నాడు. జాయచోడుని నాజూకు శరీరం రాలేదు గానీ.. అందంలో మేనమామకు తీసిపోడు మురారి. చుట్టూ పదిమంది మిత్రులను వెంటేసుకుని ఎప్పుడూ ఘళ్లుఘళ్లున నవ్వుతూ కేరింతలలో కనిపిస్తున్నాడు మురారి. రుద్రమదేవుడి పక్కన కూడా ఉన్నారు మిత్రులు.. కాదుకాదు అంతా మిత్రురాళ్లు! ఆశ్చర్యపోయాడు. రుద్రమదేవుడు.. గణపతి %-% సోమల దంపతుల ద్వితీయ సంతానం. చూపులకు ఏదో వింత శరీరుడిలా తోచాడు జాయచోడునికి. కాకతీయవంశానికి కాబోయే వారసుడు.. అతని ఆహార్యం వింతగా ఉంది. కంచుకంపై బంగారపు కవచం ధరించాడేమిటి? పరీక్షగా చూస్తే.. అది వక్షస్థలాన్ని నొక్కిపెడుతున్నట్లు! మరింత పరీక్షగా చూస్తే.. చూడకూడని యుక్తవయస్కురాలి యువ సమున్నతాలను దాచడానికి ప్రయత్నం చేస్తున్నట్లుగా తోచింది. సాధారణంగా యుద్ధవీరులైన మహిళలు అలాంటి కవచాలను ధరిస్తారు. కానీ యువ రారాజు, యుద్ధరంగంలో ఉన్నట్లు అక్క పెళ్లిసంబరాలలో దుస్తులపై కవచం ధరించడం ఏమిటి?! రుద్రమదేవుని జనన సమయంలో రాజ్యంలో చెలరేగిన వాద ప్రతివాదాలు గుర్తొచ్చాయి జాయచోడునికి. చతుష్పథం వద్ద మిత్రుల చర్చలు కళ్లముందు కదలాడాయి. ఇతనికోసమా అప్పట్లో రాజ్యమంతా అట్టుడికిపోయింది?! ఇతనా కాబోయే చక్రవర్తి? ఇతనా పరిణత రాజకీయవేత్త, రణరంగ నిపుణుడు, ఆయన కలలోకి వచ్చినా శత్రువు గుండె ఆగి మరణిస్తాడని కవులు కీర్తించే గణపతిదేవుని వారసుడు? అతణ్ని ఎగాదిగా చూసి జాయచోడుని ఆనందం ఆవిరైపోయింది. అప్పుడే రుద్రమదేవుడు కూడా జాయచోడుణ్ని పరిశీలనగా చూస్తున్నాడు. తననే చూస్తున్న రుద్రమదేవుణ్ని చూసి పలకరింపుగా నవ్వాడు జాయచోడుడు. అతను తిరస్కారంగా చూసి మూతి తిప్పుకొని వెళ్లిపోయాడు.

**దిమ్మెరపోయాడు జాయచోడుడు. వీరయువకుడు అలా మూతి తిప్పడం!??**

అభినయాలు ఎన్నిరకాలో, ప్రతి శరీరభాగ కదలికలు ఎలా ఉండాలో సప్రమాణంగా చెప్పగల మహానాట్యకారుడు జాయచోడుడు విభ్రాంతి చెందాడు. ఆ మూతి తిప్పడం?? ఎటువెళ్లినా.. ఏమి చేస్తున్నా.. ఆ మూతి తిప్పుడు దృశ్యమే మరీమరీ జాయచోడుని కళ్లముందు కదలాడుతోంది. అతనిపై దృష్టిపెట్టాడు జాయచోడుడు. అతడు ఎవ్వరితో కలవడంలేదు. పక్కన ఇద్దరు పరిచారికలు అన్నీ సమకూరుస్తూ అతని వెన్నంటి ఉన్నారు. 'వెన్నంటి ఉన్నారు' అనే కంటే.. ఎవ్వరినీ కలవకుండా కాపలా కాస్తున్నారు అనొచ్చు.వెలనాడు కార్యాలయంలోనే పనిచేస్తూ జాయచోడుడు అనుమకొండ వచ్చిన నాటినుంచి తిరిగి ఆయన ఆంతరంగిక వార్తాహరుడుగా వ్యవహరిస్తున్న వృద్ధుడైన అంకమరట్టని పిలిచి రుద్రమదేవుని కదలికలు పరిశీలించమన్నాడు. మరునాడు అంకమరట్ట చెప్పాడు చెవిలో.. "యువరాజుగారిలో అబ్బాయి కంటే అమ్మాయి లక్షణాలు ఎక్కువగా ఉన్నాయని యువకులే నవ్వుకుంటున్నారు. పైగా యువరాజుగారు యువకుల చెయ్యి తగిలినా చిరాకు పడిపోతున్నారట మహారాజా! ఇక భుజంపై చెయ్యి వేస్తే యుద్ధమేనట!". చలువపందిళ్లు వేస్తున్నచోట ఉన్నాడు రుద్రమదేవుడు. యువకులంతా కబుర్లు చెప్పుకొంటూ పనిచేస్తుంటే.. అతను మాత్రం ఇద్దరు చెలికత్తెల మధ్య చెంపకు చెయ్యి ఆన్చి విస్ఫారిత నేత్రాలతో చూస్తున్నాడు. చెలికత్తెలు ఏదో చెప్తున్నారు. ముగ్ధ మనోహరంగా అచ్చమైన తెలుగింటి ఆడపిల్లలా నవ్వుతున్నాడు. నవ్వుతున్నప్పుడు ఆ బుగ్గలపై బుజ్జిబుజ్జి చొట్టలు చూడముచ్చటగా కనిపించీ కనిపించకుండా వచ్చి పోతున్నాయి. జాయచోడుని మనసంతా విచారం అలుముకుంది. రుద్రమదేవుడు కేవలం స్త్రీ అయితే ఎంత కన్నులపండువగా ఉంటుంది! తల్లిలా ఛాయ తక్కువైనా.. అందానికి తిరుగులేదు!!

**భగవంతుడా.. బావగారికి ఎంత పెద్ద పరీక్ష పెట్టావయ్యా!!**

ప్చ్.. బావగారితో వీడి గురించి చర్చించాలి అనుకుంటూ గణపాంబ ఉన్న మందిరంలోకి ప్రవేశించాడు. ఎదురుగా గణపాంబను అలంకరిస్తున్నారు సైరంధ్రిలు, పుష్పలావికలు. సహకరిస్తూ హాస్యమాడుతున్న మిత్రురాళ్లు, బంధువుల్లోని యువతులు. అదొక యువ యవ్వన కెరటాలు ఎగసిపడుతున్న సంద్రం. ఆ మందిరమంతా విరిసిన నవ్వుల నవ సుమపరిమళంతో పల్లవించి ప్రవహిస్తోంది. 'తను ఆ యవ్వనప్రాయపు సవ్వడులను దాటిపోయాడేమో..' పలకరింపుగా నవ్వి వెనుదిరిగాడు. "మామా.." పిలిచింది గణపాంబ. ఆగి వెనుదిరిగి చూశాడు. గణపాంబ ఆత్మీయంగా పరిగెత్తుకు వచ్చింది. "వీడు.. నా తమ్ముడు. రుద్రమదేవుడు!". "ఆరోజు తండ్రిగారు పరిచయం చేశారుగా పెద్దతల్లి. కానీ, మాట్లాడలేదు" అన్నాడు రుద్రమదేవుణ్ని ఎగాదిగా చూస్తూ. "రుద్రా.. జాయచోడదేవుడు మామ. వినే ఉంటావు. దైవం ప్రసాదించిన మామ. ఎవరికోగానీ, ఇలాంటి మామ దొరుకడు. మహాయోధులు, మహానాట్యకారులు కూడా. అంతేకాదు తండ్రిగారికి అత్యంత నమ్మకస్తులు.." గొప్పగా చెప్పింది గణపాంబ. "విన్నాను. విన్నాను. పిఠాపుర యుద్ధంలో తండ్రిగారికి ఆయుధం అందించిన తీరు తండ్రిగారు ఎప్పుడూ చెబుతుంటారు. త్రిపురాంతకంలో మా యుద్ధగురువులు కూడా మామ ప్రతిభను పాఠాల వేళ ప్రస్తావిస్తుంటారు. ఇప్పుడు దగ్గరగా చూస్తున్నాను" అన్నాడు రుద్రమదేవుడు తిప్పుకొంటూ.అతని గొంతు.. హతవిధీ! ఎంత అన్యాయం చేశాడు దేవుడు. గొంతుకూడా స్త్రీలాలిత్యంతో ఎంత శ్రావ్యంగా ఉంది! రాత్రి ఆంతరంగిక మందిరంలో గణపతిదేవుడితో అన్నాడు జాయచోడుడు. "రుద్రమదేవుడి అంశంలో.. దేవుడు అన్యాయం చేశాడు బావగారు!". పెళ్లి ఏర్పాట్లలో చాలా అలసిపోయినట్లు ముఖం పెట్టాడు గణపతిదేవుడు. "వాడు.. అక్కడే ఇంకా బాగాచదివి ప్రవర్ధిష్ణువు కావాలి. కానీ, అక్కపెళ్లి చూడాల్సిందేనని పట్టుబట్టి మరీ వచ్చాడు. ప్చ్! నిద్ర వస్తోంది జాయా.." అన్నాడు ఆవులిస్తూ. ఆయన ముక్తసరిగా సంభాషణ ముగించి.. 'వెళ్లిపో!' అన్నట్లు మాట్లాడటం ఆశ్చర్యపరచింది. మరునాడు రాజనగరిలో వివాహనికొచ్చిన అతిథులకు నాట్య ప్రదర్శనలు ప్రారంభమయ్యాయి. మొదటి ప్రదర్శనే జాయచోడుని నృత్తం. తొలి ప్రదర్శన కావడం.. అదీ జాయచోడుడు నర్తించనుండటంతో రాజనగరి నాట్యమండపం కిక్కిరిసిపోయింది.అందరూ ఆయన నృత్త విన్యాసాన్ని శారీరక కదలికలను విభ్రాంతితో చూస్తున్నారు. సాక్షాత్తూ నటరాజు కైలాసం వీడి అనుమకొండ వచ్చినట్లు.. ఆడుతున్నాడు జాయచోడుడు. కానీ, అతనిలో ఏకాగ్రత లేదు. భావప్రకటన విరుద్ధంగా ఉంది. పాద ముద్రలు తడబడుతున్నాయి. హస్తముద్రలైతే ఘోరం. కానీ, ప్రేక్షకులు ఎప్పటిలాగే విస్మయంతో చప్పట్లు కొట్టి ఆయనను అభినందనలతో ముంచెత్తారు. తీవ్ర విషాదంలో కూరుకుపోయాడు జాయచోడుడు. మొదటిసారి తను నృత్తంలో తప్పటడుగులు వేశాడు. నటుని తాదాత్మ్యత కోల్పోయాడు. విన్యాస విచిత్రాలకు మాత్రమే సాధారణ ప్రేక్షకులు మైమరుస్తారు. కానీ నాట్య ప్రవీణులు చూస్తే ముఖాన ఊస్తారు. పూర్తిగా ఘోరమైన మార్గినృత్తం. దీనికంటే ఓ మారుమూల పల్లెటూరిలో దేశీ ప్రదర్శన ఉత్తమం. తల వంచుకుని రంగమండపం దిగిపోతున్న జాయచోడుడు.. ప్రేక్షకుల్లో ఓ యువతి తనను పరికించి చూడటం గుర్తించాడు. ఎవరీమె? ఎక్కడో చూచినట్లు తెలుస్తోంది. ఎవరీమె.. ఎవరై ఉంటారు?.. ఆమె చేతులు జోడించి అభినందనగా చప్పట్లు చరచి తిరిగి చేతులు జోడించి నమస్కరించి అభినందనగా చూసి మాయమైంది.ఆ పిల్లను చూశాక అతని నృత్త విఫలత తాత్కాలికంగా పక్కకుపోయింది. ఎవరీ పిల్ల?! ఎక్కడ చూశాను అనే ఆలోచన పెరిగిపోయింది. వివాహం క్రతువు పదిరోజులు. ముందువెనకా సంబరాలు మొత్తంగా నెలరోజులు. ఇటు వియ్యాలవారి ఆచార వ్యవహారాలను సమాదరిస్తూ, అటు గణపతిదేవునికి, సోమలదేవికి సహకరిస్తూ శాస్త్రీయ వివాహతంతులలోనూ జాయచోడుడే. యువకులతో చెడుగుడు, యువతులతో పాత్ర గొండ్లి, గుర్రం భంజలి.. అందరినీ కలిపి బిళ్లంగోడు.. అలాగే యువతీ యువకులకు లాస్యనాట్యం, దండరాసకం నేర్పించి, ఆడించి, ఆడి, నాట్యం చేసి నవ్వించి కవ్వించి పెళ్లి వేడుకలను మరపురాని మధుర సంఘటనగా లిఖించాడు. అప్పగింతల వేళ రాజ ప్రాసాదమంతా ఉద్వేగపు కన్నీటిలో తడిసి ముద్దయ్యింది. సహజంగా స్త్రీలందరూ తీవ్రంగా దుఃఖిస్తున్నారు కానీ కాస్త ఎక్కువగా ఏడ్చింది మాత్రం నారాంబతోపాటు రుద్రమదేవుడు! వెక్కివెక్కి ఏడ్చిన ఏకైక మగాడు!! కానీ, మరి కొన్నిరోజులలో ఓ వార్త రాజధానిలో పుట్టి పెద్దలను భయవిహ్వాలులను చేసింది. గణపతిదేవుని పెద్ద కుమారుడు.. యువరాజు రుద్రమదేవుడు ఆడమగ కానీ నపుంసకుడు!!

# ప్రొటీన్ ఎక్కువగా తీసుకుంటున్నారా.. ఈ సైడ్ ఎఫెక్ట్స్ తప్పవు

మనిషి ఆరోగ్యానికి ప్రొటీన్ ఎంతో మేలు చేస్తుంది. కానీ, మోతాదు మించితే రక్తంలో కలిసే ప్రొటీన్ విషంగా మారుతుంది. అందుకే మనిషి బరువును బట్టి అవసరమైన ప్రొటీన్ ను లెక్కగట్టి తీసుకోవాలంటున్నారు నిపుణులు. కిలో శరీరబరువుకు 0.8 గ్రాముల ప్రొటీన్ మాత్రమే అవసరం. కాబట్టి మీ బరువును బట్టి మీకెంత ప్రొటీన్ అవసరమో లెక్క వేసుకోవచ్చు. బరువు తగ్గేందుకు, కండరాల నిర్మాణానికి, కణాల రిపేర్ చేయడానికి ప్రొటీన్ చాలా అవసరం. అయితే ప్రొటీన్ అధికంగా ఆహారాన్ని అపరిమితంగా తింటే మాత్రం ఆరోగ్య సమస్యలు వస్తాయి.

**దాహం పెరుగుతుంది**

శరీరంలో ప్రొటీన్ ఎక్కువైతే శరీరం నీరసించి పోతుంది. తీవ్రమైన దాహం కలుగుతుంది. ఎందుకంటే.. అధిక ప్రొటీన్ వల్ల శరీరానికి ఎక్కువ నీరు కావాల్సి వస్తుంది. దాని వల్ల విపరీతమైన దాహం వేస్తుంది. దీనికి కారణం ప్రొటీన్లో ఉండే నత్రజని. ఇది అధికంగా రక్తంలో చేరడం వల్ల ఇలాంటి మార్పులు కలుగుతాయి. దీని వల్ల మూత్రపిండాలపై అధిక భారం పడుతుంది. వ్యర్థాలను బయటకు పంపేందుకు అధికంగా కష్టపడాల్సి వస్తుంది. ఎంత నీరు తాగిన శరీరానికి సరిపోదు. దీనివల్ల శరీరం బలహీనంగా మారిపోతుంది. తలనొప్పి ఎక్కువైపోతుంది. బరువు తగ్గి సన్నగా మారిపోతారు.

**నోటి దుర్వాసన దీని లక్షణమే..**

చాలా మంది నోటి దుర్వాసనతో బాధపడుతుంటారు. ఇందుకు ఆహారంలో అధిక ప్రొటీన్ కూడా కారణమేనంటున్నారు. ప్రొటీన్లో ఉండే రెండు ఆమ్లాల తీవ్రమైన దుర్గంధాన్ని కలిగిస్తాయి. ఇందుకోసం కూడా అధికంగా నీళ్లు తాగాల్సి వస్తుంది.



**మలబద్ధకం**

ప్రొటీన్ శరీరంలో అధికమైతే మలబద్ధకం సమస్య కూడా ఎక్కువవుతుంది. కార్బోహైడ్రేట్లు తగ్గి, ప్రొటీన్ పెరిగితే మాత్రం ఈ సమస్య మరీ తీవ్రంగా మారుతుంది. ప్రొటీన్ ఉండే ఆహారం అధికంగా తిన్నామనిపిస్తే, కార్బోహైడ్రేట్లు ఉండే ఆహారాన్ని అధికంగా తినాలి.

**ప్రొటీన్ అధికంగా ఉండే పదార్థాలు...**

కొన్ని ఆహారాల్లో ప్రొటీన్ అధికంగా దొరుకుతుంది. మటన్, చికెన్, గుడ్లు , చేపలు, రొయ్యలు, పాలు, పెరుగు, చీజ్, నట్స్ (బాదం, జీడిపప్పు,వాల్నట్స్, గుమ్మడి గింజలు, నువ్వులు, సన్ ఫ్లవర్ గింజలు, టోఫు, అన్ని రకాల బీన్స్, శెనగలు... వీటన్నింటిలో ప్రొటీన్ ఉంటుంది.

**ఒంటి నొప్పులు..**

ప్రొటీన్ ఎక్కువగా ఉండే ఆహారాలు శరీరంలో వేడిని కలిగిస్తాయి. ఉదాహరణకు చికెన్, గుడ్లు, రొయ్యలు వంటివి. వీటిని మోతాదుకు మించి తీస్కుంటే ఒంటి నొప్పులు వేధిస్తాయి.

# ప్రేమంటే ఏమిటంటే



'జనవరి జయం జయం.. ఫిబ్రవరి పెండ్లికి పిలుపు' అని చిన్నప్పటి గేయం. వాలంటైన్ పుణ్యమా అని ఫిబ్రవరి అంతా ప్రేమికుల మాసంగా మారిపోయింది. ఈ నెల కోసం యువత ఏడాదంతా ఎదురు చూస్తూ ఉంటుంది. ప్రేమను వ్యక్తం చేయడానికి, ప్రేమించిన వారితో సమయం గడపడానికి వాలెంటైన్ డేని చాలామంది ఓ ప్రత్యేకమైన సందర్భంగా భావిస్తారు. గిఫ్టలు, టూర్లు ప్లాన్ చేస్తారు. ఫిబ్రవరి 14వ తేదీ ఒక్కరోజులో ప్రపంచవ్యాప్తంగా కోట్ల రూపాయల వ్యాపారం జరుగుతుందంటే అతిశయోక్తి కాదు. గులాబీలు, చాక్లెట్లు, ఖరీదైన బహుమతుల కొనుగోళ్లతో అన్ని షాపులు బిజీ బిజీ. మనిషిని ఇంతలా వశపరచుకుంటున్న ఈ ప్రేమ ఎక్కడ మొదలవుతుంది? ఎన్ని రకాలుగా ఉంటుందో.. తెలుసుకుందాం.పరీక్షలఅప్పుడెప్పుడో గజినీ సినిమాలో సూర్య, అసిన్ 'హృదయం ఎక్కడున్నది.. హృదయం ఎక్కడున్నది..' అంటూ ప్రేమ గీతం పాడుకుంటే అందరూ ఫిదా అయ్యారు. ప్రేమ మనిషిలో ఎక్కడ ఉంటుందో తెలుసుకోవడానికి ఒక్కరూ ప్రయత్నించలేదు. సైకాలజిస్టులు మాత్రం ఈ అంశంపైన దృష్టి సారించారు. న్యూయార్క్‌లోని ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ మెడికల్ కాలేజ్‌కి చెందిన బినాక అస్విడో రొమాంటిక్ లవ్‌పై పరిశోధనలో భాగంగా ప్రేమ మెదడులో ఎక్కడ ఉంటుందో తెలుసుకోవడానికి ప్రయత్నించారు. ప్రేమలో ఉన్నవారికి ప్రేయసి లేదా ప్రియురాలు ఫొటో చూపించినప్పుడు మెదడులోని వెంట్రల్ టెగ్మెంటల్ ఏరియా (వీటీఏ), న్యూక్లియస్ అకమ్బున్స్, వెంట్రల్ పల్లిడియం, రఫే న్యూక్లియస్ ప్రాంతాలు ఉత్తేజితమయ్యాయని ఎఫ్.మ్యాగ్నెటిక్ రెజోనెన్స్ ఇమేజింగ్ ద్వారా తెలుసుకున్నారు.

**తొలి రోజుల్లో..**

వెంట్రల్ టెగ్మెంటల్ ఏరియా రివార్డ్ సిస్టంలో కీలకమైన ప్రాంతం. నూతన ప్రేమికుల్లో ఈ ప్రాంతం బాగా ఉత్తేజితమవుతుందని పరిశోధనలో తేలింది. వెంట్రల్ పల్లీడియం, రఫే న్యూక్లియస్ ప్రాంతాలు 20 ఏళ్ల తర్వాత కూడా ఒకరి పట్ల ఒకరికి ప్రేమ ఉండటానికి కారణమని తెలుస్తుంది. వెంట్రల్ పల్లీడియం అటాచ్‌మెంట్ హార్మోన్లను విడుదల చేసి బంధం నిలబడేలా చేస్తుంది. దీర్ఘకాలిక ప్రేమికుల్లో రఫే న్యూక్లియస్ సెరటోనిన్ హార్మోన్ రిలీజ్ చేసి బంధంలో కుదురుకునేటట్టుగా చేస్తుంది. మనుషుల్లో ప్రేమ భావన పెంపొందడంలో మెదడులోని రివార్డ్ సిస్టం కీలక పాత్ర పోషిస్తుందని న్యూరోసైన్స్ చెబుతుంది. మెదడులోని హిప్పో క్యాంపస్, మీడియల్ ఇన్సుల, యాంటీరియర్ సింగ్లేట్ భాగాలు రివార్డ్ సిస్టంలో ప్రధాన పాత్ర పోషించి ప్రేమ అనే భావన వృద్ధి చెందేలా చేస్తాయని పరిశోధనలో తేలింది.

**కెమికల్ గడబిడ ..**

ప్రేమ అనే ఫీలింగ్ కలిగినప్పుడు మెదడులో ఏం జరుగుతుందనే దానిపై హార్వర్డ్ మెడికల్ కళాశాల శాస్త్రవేత్తలు పరిశోధనలు చేశారు. మెదడులో విడుదలయ్యే కొన్ని రసాయనాల ఫలితమే ప్రేమ అని తేల్చి చెప్పారు. ప్రియురాలితో చూపు కలవగానే మెదడులో ఫినెల్ తలామిన్ అనే రసాయనం విడుదలవుతుంది. అరచేతుల్లో చెమట పట్టడం.. మోకాళ్లు వణకడం ఈ హార్మోన్ ప్రభావమే. ఈ లవ్ మాలిక్యూల్ కొద్ది మోతాదులో చాక్లెట్‌లా ఉంటుంది. అందుకనే వాలంటైన్ రోజు చాక్లెట్ల అమ్మకాలు ఊపందుకుంటాయి. ఒక మనిషిపై వ్యామోహం కలగడానికి మెదడు విడుదల చేసే అడ్రినలిన్, డోపమైన్, నారెఫీనెప్రిన్ హార్మోన్లే కారణం. నచ్చినవారి చూడగానే శరీరంలో ఈ హార్మోన్లు విడుదలై అనేక స్పందనలు కలిగిస్తాయి. అందుకే ప్రేమికులు గంటల కొద్దీ కబుర్లు చెప్పుకొంటారు. ప్రపంచాన్ని మర్చిపోతారు. ఈ దశలో వీరిలో ఆక్సిటోసిన్ అనే హార్మోన్ రిలీజ్ అవుతుంది. దీని ప్రభావంతో ఒకరిని ఒకరు టచ్ చేయాలని, హగ్ చేసుకోవాలని అనిపిస్తుంది. ఈ హార్మోన్ల ప్రభావం 3 నెలల నుంచి 18 నెలల వరకూ ఉంటుంది. ఆ తర్వాత కూడా ప్రేమ ప్రయాణం దీర్ఘ కాలం కొనసాగితే వాసోప్రెసిన్ అనే హార్మోన్ విడుదల అవుతుంది. ఇది ఇద్దరి మధ్య బంధం మరింత బలపడటానికి దోహదపడుతుంది.

**ఏడు రంగుల వాన**

నేటి యువత ప్రేమ అని అనుకుంటున్నది ప్రేమ కాదు. కేవలం వ్యామోహం మాత్రమే. నిజమైన ప్రేమ అంటే ఏమిటో సైకాలజిస్ట్ స్టర్న్ బెర్గ్ తన త్రిముఖ ప్రేమ సిద్ధాంతంలో వివరించారు. ఇంద్రధనుస్సులో ఏడు రంగులు ఉన్నట్టే ప్రేమకు మౌలికాంశాలు అయిన సాన్నిహిత్యం, వ్యామోహం, నిబద్ధతల కలయికలతో ఏడు రకాల ప్రేమలు పుడతాయని ఆయన వివరించారు. లైకింగ్, ఇన్ ఫ్యాట్, లవ్, ఎంప్టీ లవ్, రొమాంటిక్ లవ్, కంపానియట్ లవ్, ఫటస్ లవ్, కంజుమేటివ్ లవ్ అని ఏడు రకాల ప్రేమలు ఉంటాయని వివరించారు. వీటన్నిటిలోనూ కంజుమేట్ లవ్ అనేది అతి ముఖ్యమైనది. నేటి యువత రొమాంటిక్ లవ్‌ను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటుంది. అది పరిపూర్ణమైన ప్రేమ కాదు. సాన్నిహిత్యం, వ్యామోహం, నిబద్ధత కలగలిసిన ప్రేమే నిజమైనది, శాశ్వతమైనది. దాన్ని సాధించడం ఎంత కష్టమో, నిలుపుకోవడం కూడా అంతే కష్టం. ప్రేమ స్వరూపాన్ని, పరిపూర్ణత్వాన్ని అర్థం చేసుకున్న వారికి అది ఒక ఎమోషన్‌లా కాకుండా, మోటివేషన్‌లా పనిచేస్తుంది. ప్రేమ సఫలమైనా, విఫలమైనా జీవితంలో ముందుకు తీసుకువెళ్తుంది.

రమాయణం

# అమ్మగార్లు.. అయ్యగార్లు

మొదట్లో మా ఇంట్లో వంటకు అయ్యగారు ఉండేవారు. అయితే, మేము మిడిల్ స్కూల్‌కు వచ్చేసరికి అమ్మే వంట చేసేది. ఏరోజూ ఏడెనిమిది మందికి తక్కువ కాకుండా తను వండాల్సి ఉండేది. అయినా.. కొన్ని ప్రత్యేక సందర్భాల్లో వంటల కోసం అయ్యగార్లు, అమ్మగార్లూ వచ్చేవారు. 'ఆడ ఇక మా నాన్న తన అమ్మమ్మకూ, తాతయ్యకూ దత్తపుత్రుడు కనుక వాళ్లిద్దరికీ తద్దినాలు పెట్టేవాడు. అది చాలా ఖర్చు, శ్రమతో కూడిందైనా, నాన్న తన ఎనభై మూడో ఏట చనిపోయేదాకా.. సుమారు తన పద్నాలుగో ఏట నుంచీ.. అంటే డబ్భై ఏళ్లపాటు ఎంతో శ్రద్ధగా ఆబ్దికాలు పెట్టేవాడు. "ఎందుకు నానా ఈ తద్దినం పెట్టడం?!" అని ఓసారి అడిగాను. దానికి నాన్న ఎంతో ఓపిగ్గా.. "మనం రోజూ అన్నం తింటం గద! మరి పై లోకానికి పోయినోళ్లకు ఎవరు పెడతరు?! మనకు ఒక సంవత్సరం అయితె వాండ్లకు ఒకరోజు అన్నట్టు. అందుకోసం వాండ్లకు ఏడాదికొక్కసారి పిండాలు పెట్టాలె. దాన్ని కాకులకో, పక్షులకో పెడుతం. వాండ్లు పక్షుల రూపంల ఒచ్చి తినిపోతరని, అట్ల వాండ్ల దీవెనలు ఉంటయని పెద్దవాండ్ల నమ్మకం!" అని చెప్పాడు. అట్లాగే ఇంకోమాట కూడా చెప్పాడు.. "పెద్దవాండ్ల విశ్వాసం కోసం అది చెయ్యాలె. ఆ పేరుతోటి ఆరోజు ఒక పదిమంది ఆకలితోటి ఉన్నవాండ్లకు భోజనం పెడితే బాగుంటదని నాకనిపిస్తది".. ఆ మాట నాకు ఇప్పటికీ గుర్తుంది. వారం ముందే ఓ జీతగాడిని వెంటపెట్టుకుని వెళ్లి కిరాణా సామాను తెచ్చేవాడు నాన్న. అప్పుడే కాదు.. నాన్న ఎప్పుడు ఇంట్లోకి సామాను తెచ్చినా నాకూ, అక్కకూ చెరో బిస్కట్ ప్యాకెట్ తెచ్చి ఇచ్చేవాడు. మేము వాటికోసమే ఎంతో ఆత్రంగా ఎదురు చూసేవాళ్లం. అదే మాకు చాలా గొప్ప ఔట్ సైడ్ ఫుడ్. అదికూడా తరచుగా ఉండేది కాదు. ఏదైనా ఇంట్లో చేసింది తినడమే! తద్దినం రోజు ఏడింటికల్లా మా పక్కఊరు చాగల్లు నుంచి సింహయ్యగారు, ఆయన కొడుకు కేశవయ్యగారు వచ్చేవారు. ఆరోజు వీలైనంత వరకూ నేను బడి ఎగ్గొట్టడం తప్పనిసరి అని వేరే చెప్పక్కర్లేదుగా! వాళ్లు వస్తూనే మడిపంచెలు కట్టుకుని వంటింట్లో దూరేవారు. అమ్మకు ఒక్క వంట తప్పేది కానీ, మిగతా అన్ని పనులూ పెరిగేవి. ఓ పది రకాల వంటకాల కోసం బోలెడు కూరగాయలు కోసి, మిగతా వంట సామానంతా సిద్ధం చేసి ఉంచేది. వాళ్లు పిలిస్తే చాలు.. "ఏం గావాలె అయ్యగారూ!" అంటూ సిద్ధంగా ఉండేది. దగ్గరి మూడు కుటుంబాల బంధువులు భోజనాలకు వచ్చేవారు. ఇంకా పదిమంది దాకా పనివాళ్లకు, ఆరోజున ఎందరొస్తే అందరు బిచ్చగాళ్లకు భోజనాలు పెట్టడం అమ్మవంతే అయ్యేది. మేము కాస్త పెద్దయిం తరువాత వడ్డనలు చేసేవాళ్లం. అప్పుడు గ్రైండర్లు, మిక్సర్లు లేవు గనుక.. అయ్యగార్లు పెద్దరోటి ముందు కూచుని పప్పు రుబ్బేవారు. వాళ్లు చేసే గారెలు భలే రుచిగా ఉండేవి. మమ్మల్ని వంట చేసేటప్పుడు ఆ దరిదాపులక్కూడా రానిచ్చేవారు కాదు. మాకేమో మగవాళ్లు ఎలా వండుతారో చూద్దామని కుతూహలం. "ఇటు దిక్కు రావొద్దు.. మడి!" అనేవారు. ఇంకొక బ్యాచ్ బ్రాహ్మలు వచ్చి ఏవో మంత్రాలు చదివి నాన్నచేత తద్దినం పెట్టించేవారు. తరువాత అందరం వరుసగా కింద చిన్న చాపల మీద కూచొని.. ముందు విస్తర్లు పరుచుకుని ఉంటే, వాళ్లే వడ్డన చేసేవారు. సింహయ్య గారు అప్పటికే చాలా పెద్దాయన. ఆయనకు వంగడం వచ్చేది కాదు. అన్నిటినీ నిలబడే అంతెత్తునుంచి తపుక్కున విస్తట్లో వేసేవాడు. అయినా మేము భయంతో ఏమీ అనేవాళ్లం కాదు. ఆ తరువాత చాలా ఏళ్లపాటు కేశవయ్యగారు కూడా వచ్చేవాడు. నాన్న చనిపోయాక ఇక మా పుట్టింట్లో తద్దినాలు పెట్టడం ఆగిపోయింది. కొన్నాళ్లకు కేశవయ్యగారు మంచాన పడ్డాడని తెలిసి వెళ్లి చూసొచ్చాను. ఆయన పోయినా ఇప్పటికీ ఆ కుటుంబంతో



టచ్‌లోనే ఉన్నాం. మా చిన్నప్పుడు కూనూరు నుంచి లక్ష్మయ్యగారు, వాళ్లన్నయ్య మత్స్యయ్యగారు మా ఇంటికి వచ్చి పోతుండేవారు. "గీ మత్స్యయ్య ఏం పేరు? గీయిన మనిషే గద.. చేప పేరు పెట్టుకున్నడేంది?!" అని అమ్మను అడిగాను. "నీకు కోతి మాటలు బాగ ఎక్కువయినయ్! శ్రీ మహావిష్ణువు దశావతారాలల్ల మొదటిది ఏంది?!" అన్నది అమ్మ. నాకు ఠక్కున గుర్తొచ్చింది. "తిరుపతి, యాదగిరి, సింహాచలం.. అని దేవుని గుళ్లుండే ఊరి పేర్లు పెట్టుకున్నట్టే.. మత్స్యగిరి, వరాహగిరి, కూర్మనాథం అని కూడా పెట్టుకుంటరు" అన్నది అమ్మ. అప్పుడర్థమైంది. ఇంతకూ ఈ మత్స్యయ్యగారి గురించి చెప్పొచ్చేదేంటంటే.. ఈయన ఎప్పుడూ మా అక్కాచెల్లెళ్లిద్దరి మధ్యలో ఏదోఒక గొడవో, పోటీనో పెట్టి తమాషా చూద్దామనుకునేవాడు. మేమేం తక్కువా?! ఆదర్శ అక్కాచెల్లెళ్లం మరి! మాకు పెద్దగా కొట్లాటలే వచ్చేవి కావు. ఆయన మా పుట్టినరోజులు గుర్తు పెట్టుకుని ఒకరోజు ముందుగానే వచ్చేవాడు. పుట్టినరోజంటే పెద్దగా కేక్ కట్‌చేయడం, స్నేహితుల్ని పిలవడం, సెలెబ్రేట్ చేయడం లాంటివి మాకు తెలియదు. ఆరోజు తలంటు పోసుకోవడం, ఉన్నంతలో కొత్త బట్టలు వేసుకోవడం చేసేవాళ్లం. అమ్మ ఏదైనా స్వీట్ చేసేది. ఈ మత్స్యయ్యగారు రాగానే.. "పోయినేడు మీ చెల్లె పుట్టినరోజుకు లడ్డూలు చేయించింది అమ్మ. మరి నీ పుట్టిన్రోజుకు ఏం చెయ్యాలె చెప్పు?! మీ అమ్మను అడుగు" అంటూ అక్కను రెచ్చగొట్టేవాడు. ఇక అక్క లడ్డూలు చేయించమని అమ్మ వెంటపడేది. ఆ తరువాత వచ్చే నా పుట్టినరోజు కూడా అంతే! "మీ అక్క పుట్టినరోజుకు లడ్డూలు చేసిన్రు. నీకు గూడ గవ్వే అయితె ఏం బావుంటది?! మంచిగ మైసూర్ పాక్ చేయించుకో.. అమ్మ తోటి చెప్పుపో!" అనేవాడు. "ఏం జెయ్యాల్నో అమ్మకు తెల్సు" అనేదాన్ని నేను. ఈయన కథ ఇలా ఉంటే.. అప్పుడప్పుడూ మా ఇంటికి కూనూరు నుంచి అండమ్మగారూ, లక్ష్మయ్యగారూ వచ్చేవారు. వాళ్ల ముచ్చట్ల గురించి వచ్చేవారం చెప్పుకొందాం!

Ho no:LIG-32,, Ph No:- 9247842354, 9059207979,near water tank, Bharat Nagar colony, moos-apet, Hyderabad, pin code 500018.